ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 మంగళవారం 26 ఆగస్టు 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## భారత భద్రతా నిబంధనలతోనే స్టార్‌లింక్ సేవలకు గ్రీన్‌సిగ్నల్!

బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ సంస్థకు స్థానికంగా శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు భారత్ అనుమతించింది. అయితే భారతీయ వినియోగదారుల డేటాను విదేశాలకు రూటింగ్ చేయడం, కాపీ చేయడం, డీక్రిప్ట్ చేయడం వంటివి నిషేధమని కేంద్రం స్పష్టం చేసింది. యూజర్ ట్రాఫిక్ ఎక్కడా విదేశీ సర్వర్‌లకు మిర్రర్ అవకుండా ఉండేందుకు దేశంలోనే ఎర్త్ స్టేషన్ గేట్‌వేలను ఏర్పాటు చేయాలని షరతులు విధించింది. ఈ నిబంధనలకు అంగీకరించిన తర్వాతే టెలికమ్యూనికేషన్ విభాగం. స్టార్‌లింక్‌కి యూనిఫైడ్ లైసెన్స్ మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

# ఆక్స్‌ఫర్డ్‌లా ఓయూ!

- విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి కృషి చేద్దాం
- ఓయూ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ఇంజనీర్ల కమిటీ
- వర్సిటీకి ఏమేమి కావాలో ప్రణాళిక తయారు చేయండి
- డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ పెట్టండి
- అక్కడికక్కడే అన్ని సమస్యల పరిష్కారానికి జీవోలు జారీ చేయిస్తా
- ఓయూ, తెలంగాణ మధ్య విడదీయలేని సంబంధం ఉందన్న సీఎం
- 15 రోజుల్లో కోదండరాంను మళ్లీ ఎమ్మెల్సీ చేస్తామని వెల్లడి
- రెండు హాస్టళ్లు ప్రారంభించిన సీఎం, మరో రెండు హాస్టళ్లకు శంకుస్థాపన



సూర్య హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి కృషి చేద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీల మాదిరి తీర్చిదిద్దుదామని అన్నారు. ఓయూను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ఇంజనీర్ల కమిటీని నియమించాలని అధికారులను ఆదేశించారు. ఓయూకు ఎంత ఇచ్చినా తక్కువేనంటూ, ఏమేమి కావాలో ప్రణాళికను తయారు చేయాలని సూచించారు. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ ఏర్పాటు చేస్తే వస్తానని, అధ్యాపక ఉద్యోగాల సమస్యతో పాటు అన్ని సమస్యల పరిష్కారానికి అక్కడే వెంటనే జీవోలు జారీ చేయిస్తానని చెప్పారు. సోమవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించిన పీజీ విద్యార్థుల దుందుభి, ఇంజనీరింగ్ విద్యార్థుల భీమా హాస్టల్ భవనాలను సీఎం ప్రారంభించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నిర్మించనున్న మరో రెండు హాస్టల్ భవనాలకు, రూ.10 కోట్ల - మిగతా2లో



## పీఎం, సీఎంలు జైళ్ల నుంచి
# పాలిస్తారా?

- విలువల స్థాయి పెంపునకే రాజ్యాంగ సవరణ బిల్లు
- భిన్న కారణాలతో జైలుకెళ్లిన నేతలంతా రాజీనామాలు చేశారు
- నిస్సిగ్గుగా అక్కడి నుంచే పాలించే సంస్కృతి రెండేళ్లుగా మొదలైంది
- సోహ్రాబుద్దీన్ కేసులు కొట్టివేసే వరకు నేను ఏ పదవీ తీసుకోలేదు
- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో అమిత్‌షా

7లో

# గగనసింహాలకు బై బై!



- ఆరుదశాబ్దాలు అద్వితీయ సేవలు అందించిన మిగ్%-%21 యుద్ధవిమానాలు
- చివరిసారిగా దిగ్గజ లోహవిహంగాలతో వైమానిక విన్యాసాలు చేసిన ఫైటర్‌జెట్ పైలట్లు
- వచ్చే నెలలో మిగ్ సేవలకు గౌరవప్రదంగా పరిసమాప్తి పలకనున్న వాయుసేన

సూర్య హైదరాబాద్

దశాబ్దాలపాటు భారత గగనతలాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చి కంటికి రెప్పలా కాపాడిన మిగ్–21 రకం యుద్ధవిమానాలు ఇక శాశ్వత విశ్రాంతి తీసుకునే సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో చివరిసారిగా వీటిని ఫైటర్‌జెట్ పైలట్లు తమ విధి నిర్వహణ కోసం వినియోగించుకున్నారు. సోమవారం రాజస్తాన్‌లోని బికనీర్‌లో ఉన్న నాల్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ గగనతలంపై వైమానిక విన్యాసాలు పూర్తిచేశారు. వీటికి వీడ్కోలు సూచికగా ఇప్పటికే ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ఒక్కరే మిగ్%–%21ను నడిపి అలా గగనవీధిలో చక్కర్లు కొట్టివచ్చారు. ఏకంగా 62 సంవత్సరాలపాటు సేవలందించిన దిగ్గజ వాయుసేన విమానాలకు గౌరవప్రదంగా వీడ్కోలు పలికేందుకు భారత - మిగతా7లో



## యూరియా పాపం
# కేంద్రానిదే

- ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు
- రైతులకు మంత్రి తుమ్మల బహిరంగ లేఖ
- ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1,69,325 టన్నులను కేటాయిస్తే.. 1,06,852 టన్నుల మేర సరఫరా జరిగింది
- యూరియా విషయంలో సోషల్‌మీడియాలో బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోంది

## రేవంత్, మోదీల మధ్య లోపాయికారీ ఒప్పందం

ఇద్దరూ కలిసి రాహుల్‌ని దెబ్బతీయడం ఖాయం
భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



సూర్య హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని, ఇది తెలంగాణ భవిష్యత్‌కు ప్రమాదకరమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపాలు... తెలంగాణకు ద్రోహం చేయడంలో కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో - మిగతా2లో



## కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసులను
# సీబీఐకి అప్పగించాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు డిమాండ్

సూర్య హైదరాబాద్

కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసులను సీబీఐకి అప్పగించి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒక్కటి కాదని నిరూపించుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు 'ఓటుకు నోటు' వ్యవహారం నుంచి, భారత రాష్ట్ర సమితి నాయకులు - మిగతా2లో


# ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ శాసనసభ



- ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ శాసనసభ
- విపక్షాలకూ స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం..
- 'దేశ లెజిస్లేటివ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు.. విఠల్‌బాయి పటేల్‌దే
- ఆయన న్యాయవాద వృత్తిలో, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర మరువలేనిది.
- అఖిల భారత స్పీకర్ల సదస్సులో గడ్డం ప్రసాద్

సూర్య హైదరాబాద్

ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ శాసనసభను నిర్వహిస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలకు సైతం స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామన్నారు. సోమవారం ఢిల్లీలో అఖిల భారత స్పీకర్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. తొలి శాసన సభాపతిగా విఠల్‌బాయి పటేల్ వారసత్వాన్ని, విలువలను కొనసాగించాల్సిన అవసరముందని చెప్పారు. 'దేశ లెజిస్లేటివ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు.. విఠల్‌బాయి పటేల్‌దే.. ఆయన న్యాయవాద వృత్తిలో, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర మరువలేనిది. 1925లో బ్రిటిష్ వలస పాలనలో విఠల్ బాయి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్‌గా - మిగతా2లో



## ఒత్తిడి పెరిగినా
# భరిస్తాం

- రైతులు, పశు పోషకులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలపై రాజీ పడం
- ఆర్థిక ప్రయోజనాల చుట్టూ ప్రపంచ రాజకీయాలు తిరుగుతున్నాయి
- రక్షణ, శక్తికి మారుపేరుగా నిలిచిన 'సుదర్శన చక్రధారి శ్రీకృష్ణుడు
- అమెరికా 50% సుంకాల అమలుపై ప్రధాని నరేంద్ర మోదీ

7లో

# ఆక్స్‌ఫర్డ్‌లా ఓయూ!

-మొదటిపేజీ తరువాయి

వ్యయంతో నిర్మించే డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూంలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో వీసీ ప్రొఫెసర్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో 'తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక' అనే అంశంపై ప్రసంగించారు. ఓయూ విశిష్టతను, ఉద్యమాల చరిత్రను వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాంత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితర విద్యార్థులను స్మరించుకున్నారు.

**ఓయూ అంటేనే తెలంగాణ**

'ఓయూ అంటేనే తెలంగాణ. రెండింటి మధ్య విడదీయలేని సంబంధం ఉంది. 1935లో వందేమాతరం, 1938లో సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో ఓయూ విద్యార్థుల పాత్ర కీలకం. మలి దశ తెలంగాణ ఉద్యమం విద్యార్థుల ఆత్మ బలిదానాలతోనే విజయం సాధించింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, కేంద్ర మాజీ హోంమంత్రి శివరాజ్ పాటిల్, మర్రి చెన్నారెడ్డి, జార్జిరెడ్డి, జైపాల్‌రెడ్డి, గద్దర్ తదితరులను అందించిన ఘనత ఓయూది. చదువుతో పాటు తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు విద్యార్థులు ఎదిరించి పోరాడారు. యువతే దేశ సంపద. 21 ఏళ్లకు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతున్నారు. యువకులు రాజకీయాల్లోకి ప్రవేశించి ఎమ్మెల్యేలు కావాలి..' అని సీఎం ఆకాంక్షించారు.

**నేనూ మీలో ఒకడినే..**

ఓయూలో 60 ఏళ్లకు పైబడిన పాత భవనాలు ఉన్నాయని, కొత్త భవనాల నిర్మాణం, 2,500 మందికి సరిపడ కన్వెన్షన్ హాల్, ఇతర అవసరాలకు నిధులు మంజురు చేయాలని వీసీ కుమార్ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ..ఇంజినీర్ల కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆదేశించారు. 'ప్రజలకు పంచేందుకు భూములు లేవు.. ఇచ్చేందుకు డబ్బులు లేవు. నాణ్యమైన విద్యను మాత్రమే ఇవ్వగలం. ఈ సంవత్సరం విద్యకు రూ.40 వేల కోట్లు వెచ్చించనున్నాం. విద్యార్థులు బాగా చదువుకోవాలి.

ఓయూలోనే చదివిన దయాకర్ ఎమ్మెల్సీ అయ్యాడు, బాలలక్ష్మీ, చారకొండ వెంకటేష్ ప్రభుత్వంలో భాగస్వాములయ్యారు. నేనూ మీలో ఒకడినే. తెలంగాణలోనే పుట్టా..ఇక్కడే పెరిగా. ఇక్కడే చదువుకున్నా. జెడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ అయ్యా. మీరు చేస్తేనే సీఎం కూడా అయ్యా.




మంత్రులు, ఎమ్మెల్యేలు మీకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. అపోహలకు, అబద్ధాల సంఘాలకు నమ్మి మోసపోకండి. డిసెంబర్‌లో ఒక పోలీసు కూడా లేకుండా ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభను ఏర్పాటు చేయండి. నా రాకను అడ్డుకునేవారు అడిగే అన్ని ప్రశ్నలకు జవాబు చెబుతా..' అని రేవంత్ పేర్కొన్నారు.

**కేసీఆర్, కేటీఆర్‌లకు అభివృద్ధి కన్పించడం లేదు..**

'పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా తెలంగాణ కోసం పోరాడిన ప్రొ.కోదండరాం ఎమ్మెల్సీ పదవిని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లి రద్దు చేయించి పైశాచిక ఆనందం పొందారు. ఆయన్ను 15 రోజుల్లో తిరిగి ఎమ్మెల్సీని చేస్తాం. హెచ్‌సీయూ భూముల్లో ఏఐ టెక్నాలజీతో ఏనుగులు, సింహాలు పెట్టారు. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేవు.. మానవ మృగాలే ఉన్నాయి.

తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దినా కేసీఆర్, కేటీఆర్‌కు కనిపించడం లేదు. నాపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ అంతానికి ఈగల్ ఫోర్సును, అక్రమ కట్టడాల నిర్మూలనకు హైడ్రాను ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ఓయూ భూములను ప్లాట్లు చేసి అమ్ముకుంటారు..' అని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు.

**సీఎం రీసెర్చ్ ఫెలోషిప్‌లు ప్రారంభం**

ఓయూలో 2025%-%26 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టిన సీఎం రీసెర్చ్ ఫెలోషిప్‌ను, విదేశాలలో పరిశోధనలకు వెళ్లే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫెలోషిప్‌ను సీఎం ప్రారంభించారు. విద్యార్థుల పరిశోధనలకు.. సింగరేణి కాలరీస్, ఓయూ, ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ ఆర్థిక సహకారంతో ఈ ఫెలోషిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. నెలకు రూ.5 వేల చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కాలేజీ విద్య కమిషనర్ శ్రీదేవసేన, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, తదితర నేతలతో పాటు పలువురు ఓయూ అధికారులు పాల్గొన్నారు.

# యూరియా పాపం కేంద్రానిదే

హైదరాబాద్

రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడటానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విపక్షాలు చెప్పే మాయమాటలు, దుష్ప్రచారాన్ని నమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఈ మేరకు రైతులకు బహిరంగ లేఖ రాశారు. కేంద్రం కేటాయింపులు, సరఫరా, స్వదేశీ యూరియా, దిగుమతి చేసుకున్న యూరియా, ప్రస్తుత పరిస్థితులను ఆ లేఖలో వివరించారు. "దేశానికి దిగుమతి అయిన యూరియాలో.. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కేంద్రం 3.94 లక్షల మెట్రిక్ టన్నుల మేర మన రాష్ట్రానికి కేటాయించింది. అందులో 2.10 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలతో ఎర్రసముద్రంలో నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దేశీయ యూరియా ఉత్పత్తి కూడా ఆశించిన స్థాయిలో



లేదు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1,69,325 టన్నులను కేటాయిస్తే.. 1,06,852 టన్నుల మేర సరఫరా జరిగింది. ఇది కూడా యూరియా కొరతకు కారణమే" అని ఆయన వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల టన్నులు, ఆగస్టు నాటికి 8.30 లక్షల టన్నులను కేటాయించినా.. ఇప్పటికి 5.72 లక్షల టన్నులు రాష్ట్రానికి అందిందని, ఇంకా 2.58 లక్షల టన్నుల యూరియాను సరఫరా చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర బీజేపీ నేతలు వాస్తవాలను గ్రహించి, ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు.

బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు

యూరియా విషయంలో సోషల్‌మీడియాలో బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని బహిరంగ లేఖలో తుమ్మల మండిపడ్డారు. "రైతుల ముసుగులో బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారు. పీఏసీఎస్ కార్యాలయాల వద్ద చెప్పులు క్యూలైన్‌లో పెట్టిస్తున్నారు. మహిళలను క్యూలైన్‌లో నిలబెట్టి, సోషల్ మీడియాలో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. ఈ చర్యలతో శునకానందం పొందుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు నానో యూరియా వాడకాన్ని పెంచాలని తుమ్మల కోరారు. "నానో యూరియాతో భూసారం దెబ్బతినదు. తక్కువ ఖర్చుతో రైతులకు మేలు జరుగుతుంది. పర్యావరణహితంగా ఉంటుంది" అని వివరించారు.

# 'బండి సంజయ్ సహా బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారు'

కరీంనగర్

తెలంగాణలో బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారని సంచలన ఆరోపణలు చేశారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. రాష్ట్రంలో బీజేపీ ఎంపీల గెలుపుపై తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. అలాగే, బీహార్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది అంటూ జోస్యం చెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో బండి సంజయ్ సహా, బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారు. ఆ మాటకు నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. మాకు తెలంగాణ బీజేపీ ఎంపీల గెలుపుపై అనుమానాలున్నాయి. ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాస్తాం. మా నిజామాబాద్ జిల్లాలోనూ దొంగ ఓట్లున్నాయి. అది నేను నిరూపిస్తాను. మహారాష్ట్రలో కోటి దొంగ ఓట్లు నమోదు చేశారు. నిజామాబాద్‌లోనూ మహారాష్ట్ర ప్రజలకు ఓట్లు ఉన్నాయి. కరీంనగర్‌లోనూ ఓ డబల్ బెడ్ రూమ్ ఇంట్లో 69 ఓట్లు ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. ఓట్లు చోరీ చేసే అవసరం కేవలం బీజేపీకే ఉంది. బీహార్ ఎన్నికల్లోనూ అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రజల్ని చైతన్యపర్చేందుకే రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారు. రాహుల్ పాదయాత్రకు అనూహ్య స్పందన వస్తోంది. బీహార్‌లో కాంగ్రెస్ ప్రభంజనం రాబోతుంది అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



## ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ శాసనసభ

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికవడం సాధారణ విషయం కాదు. ఆయన స్పీకర్‌గా ఉన్నప్పుడే 1929లో భగత్‌సింగ్, భటుకేశ్వర్ దత్ వలస పాలనను వ్యతిరేకిస్తూ సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరారు. అప్పుడు కూడా ఆందోళన చెందకుండా ఆయన సమయస్ఫూర్తితో వ్యవహరించారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొనే తెలంగాణ శాసనసభను నడుపుతున్నాం' అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాశ్ కూడా పాల్గొన్నారు.

## కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసులను సీబీఐకి అప్పగించాలి

-మొదటిపేజీ తరువాయి

'ఫోన్ ట్యాపింగ్' కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్‌లో సోమవారం భాజపా బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. 'కాంగ్రెస్ నేతలు, దళారులు రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. 19 నెలలు గడిచినా రాష్ట్రవ్యాప్తంగా 73 ఇళ్లు మాత్రమే తుది దశలో ఉన్నాయి. ఓడిపోతామన్న భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించడం లేదు' అని రామచందర్‌రావు ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక 18 లక్షల ఓట్లు గల్లంతయ్యాయనే ప్రచారం జరిగిందని, అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. భాజపాలో చేరారనే కోపంతో కొందరు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకులు రద్దు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమరయ్య, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్, మోదీల మధ్య లోపాయికారీ ఒప్పందం



-మొదటిపేజీ తరువాయి

సోమవారం మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు భారాసలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "గతంలో భారత రాష్ట్ర సమితి హయాంలో నిర్మించిన భవనాలను, నిర్మాణాలను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉత్సాహం చూపుతున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సోమవారం సీఎం ప్రారంభించిన భవనాలకు గతంలో కేసీఆర్ పునాదులు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా.. గోదావరి నీళ్లను ఏపీకి ధారాదత్తం చేస్తున్నారు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకే ఏపీకి, తమిళనాడుకు లబ్ధి చేకూర్చేలా రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారు. రాష్ట్రంలో యూరియా కొరతతో ఒకవైపు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే.. మరోవైపు సినిమా వాళ్లతో ముఖ్యమంత్రి సమావేశాలు పెట్టుకున్నారు. సీఎంపై మాట పడకుండా భాజపా కాపాడుతోంది. రేవంత్, మోదీ.. ఇద్దరూ కలిసి రాహుల్‌ను దెబ్బతీయడం ఖాయం. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను భాజపా ఎంపీలు ప్రశ్నించడం లేదు. కానీ, కేసీఆర్‌పై మాత్రం విమర్శలు చేస్తున్నారు. అమృత్, హెచ్‌సీయూ భూముల కుంభకోణాలపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా.. కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? పరిశ్రమలు, పెట్టుబడులు, విభజన హామీల అమలు.. అన్నింటిలోనూ తెలంగాణకు భాజపా తీరని అన్యాయం చేసింది. లక్షల ఉద్యోగాలు కల్పించే ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేసింది. హైదరాబాద్‌లోని డిఫెన్స్ కారిడార్‌ను బుందేల్‌ఖండ్‌కు తరలించింది. కేన్స్, మైక్రాన్ వంటి సంస్థల రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులనూ గుజరాత్‌కు తరలించుకుపోయారు. తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల, వైద్య కళాశాల, ఐఐఎం కూడా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇవ్వలేదు. పసుపు బోర్డును చిన్న గదికి పరిమితం చేసింది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు జాతీయ హోదా ఇవ్వలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెప్పిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. అందుకే కాంగ్రెస్, భాజపాల మోసాలను ప్రజలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిప్పికొట్టాలి. భారత రాష్ట్ర సమితి అభ్యర్థులను గెలిపించుకోవాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. అంతకుముందు మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడకు చెందిన పలువురు భారత రాష్ట్ర సమితి నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఒంటరి అయ్యారని, రానున్న ఎన్నికల్లో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేయాలని కేటీఆర్ కోరారు.

## బీసీ రిజర్వేషన్లపై ఆర్.కృష్ణయ్య దీక్ష

రాంనగర్



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఒకరోజు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'19 నెలలుగా బీసీ రిజర్వేషన్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోంది. బీసీలకు 42% రిజర్వేషన్లు అంటూ హామీ ఇచ్చి ఇప్పుడు పార్టీ తరఫున 'బీ-ఫారమ్' అంటూ కొత్త డ్రామాకు తెరలేపుతోంది. ఒక పార్టీ బీసీలకు అవకాశం ఇస్తే ఇంకొక పార్టీ అగ్రకులాలకు, డబ్బున్న వాళ్లకు టికెట్ ఇస్తుంది. ఇంకొందరు డబ్బున్న అగ్రకులాల వ్యక్తులు స్వతంత్రులుగా పోటీ చేస్తారు. అలాంటప్పుడు బీసీలకు న్యాయం ఎలా జరుగుతుంది? రిజర్వేషన్ల అమలుకు అనేక ప్రత్యామ్నాయాలు ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా కేంద్రంపై నెట్టి తప్పించుకోవాలని రేవంత్ సర్కార్ చూస్తోంది' అని కృష్ణయ్య విమర్శించారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవంతో చెలగాటమాడితే ఊరుకునేదిలేదన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని, 42% రిజర్వేషన్లు అమలయ్యేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ నాయకులు ఆనంద్‌గౌడ్, అరుణ్ యాదవ్, నీల వెంకటేశ్, బాలరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం, సీఎంలు జైళ్ల నుంచి పాలిస్తారా?

దిల్లీ

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు జైళ్ల నుంచి ప్రభుత్వాలను నడపవచ్చా? కారాగారాలను కార్యాలయాలుగా మార్చుకొని పీఎం, సీఎం పరిపాలించడం ప్రజాస్వామ్యానికి శోభనిస్తుందా అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. నేతలు జైల్లోఉంటే ఫైళ్లు పట్టుకుని వాటిపై ఆదేశాల కోసం క్యాబినెట్ కార్యదర్శి, ముఖ్యకార్యదర్శులు, డీజీపీలు జైళ్లకు తిరగాలా? ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని ప్రపంచం గౌరవిస్తుందా? అని నిలదీశారు. ప్రజా జీవితంలో ఇంతటి సిగ్గుమాలిన పరిస్థితి వస్తుందని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరన్నారు. జైలుకెళ్లిన ఎంతోమంది నేతలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేశారని, అక్కడినుంచే పరిపాలించే కొత్త సంప్రదాయం అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మంత్రుల నుంచి మొదలైందని విమర్శించారు. వీటిని అరికట్టడానికే.. తీవ్ర నేరాభియోగాలున్న కేసుల్లో జైలుకెళ్లి 30 రోజుల్లోపు బెయిల్ పొందలేకపోయినవారి పదవులు వెంటనే పోయేలా బిల్లు తెచ్చామని చెప్పారు. సోమవారం ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..



**ఒక వ్యక్తి జైలుకెళ్తే ప్రభుత్వాలేమీ కూలవు**

ఏదైనా బిల్లును పార్లమెంటు ముందుకు తెచ్చేటప్పుడు ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకించాలి? అలా ప్రయత్నించడం మంచిదా? అది ప్రజాస్వామ్యమా? పార్లమెంటు ఉన్నది గొడవల కోసమా? దేశంలో ఎన్డీయే ముఖ్యమంత్రుల సంఖ్య ఎక్కువ. అందువల్ల ఈ బిల్లు విపక్షాల ముఖ్యమంత్రుల కోసమేననే ప్రశ్న ఉత్పన్నం కాదు. ఎన్డీయే ముఖ్యమంత్రులపై ఎఫ్ఐఆర్‌లు నమోదుకావన్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించడమే. మంత్రులు, ముఖ్యమంత్రులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదుచేస్తే హైకోర్టులు, సుప్రీంకోర్టు చూస్తూ కూర్చోవు. బెయిల్ రాకపోతేనే పదవి వదులుకోవాల్సి వస్తుంది. కేసు కారణంగా ముఖ్యమంత్రి తన పదవి కోల్పోయినా వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీకి సభలో మెజార్టీ ఉంటుంది కాబట్టి ప్రభుత్వం కొనసాగుతుంది. ఒకవ్యక్తి జైలుకెళ్లినంతమాత్రాన ప్రభుత్వాలేమీ కూలవు. అయిదేళ్లకు మించి శిక్షపడటానికి అవకాశం ఉన్న తీవ్రమైన కేసుల్లోనే పదవి నుంచి దిగాల్సి వస్తుంది తప్పితే చిన్నచిన్న ఆరోపణలతో కాదు. ప్రజాప్రతినిధికి ఏదైనా కేసులో రెండేళ్లకు మించి శిక్షపడితే వారి పదవి దానంతట అదే రద్దవుతుంది. ఉన్నత న్యాయస్థానాల్లో ఉపశమనం లభిస్తే సభ్యత్వ పునరుద్ధరణ జరుగుతుంది. ఆప్ చెప్పే అబద్ధాలు నమ్మొద్దు. ఎంతోమంది మంత్రులు, ముఖ్యమంత్రులు రాజీనామా చేసిన తర్వాతే జైలుకుపోయారు. రాజీనామా చేయకుండా పదవుల్లో కొనసాగే పోకడ ఇప్పుడే ప్రారంభమైంది. దిల్లీ ముఖ్యమంత్రి, మంత్రులు, తమిళనాడు మంత్రులు ఈ కొత్త సంస్కృతికి నాంది పలికారు.

**అవినీతిపరుల్ని కౌగిలించుకుంటున్న రాహుల్**

కేంద్రంలో యూపీయే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న లాలూప్రసాద్‌యాదవ్‌కు శిక్ష పడినప్పుడు ఆయన సభ్యత్వం కోల్పోకుండా చేయడానికి నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆర్డినెన్సు తెచ్చింది. రాహుల్‌గాంధీ విలేకర్ల సమావేశంలో దానిని చించేశారు. కాంగ్రెస్ ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయాన్నే నాడు నైతికత ఆధారంగా ఎగతాళి చేశారు. అదే రాహుల్‌గాంధీ ఇప్పుడు బిహార్ ఎన్నికల్లో గెలవడానికి.. అవినీతి కేసుల్లో శిక్షపడినవారిని కౌగిలించుకుంటున్నారు. ఆర్డినెన్సును చించేయడం వెనుక ఔచిత్యమేమిటో చెప్పగలరా? మూడుసార్లు ఓడిపోవడంతో నైతికత పోయిందా? కేసుల నుంచి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి ఉన్న రక్షణ పరిధిలోకి ప్రధానమంత్రిని కూడా చేరుస్తూ ఇందిరాగాంధీ రాజ్యాంగ సవరణ చేపట్టారు. మోదీ మాత్రం ప్రధానమంత్రి పదవిలో ఉన్నవారు జైలుకెళ్లినా పదవి కోల్పోవాల్సిందేనన్న దృఢచిత్తంతో ఈ బిల్లు పరిధిలోకి పీఎంనీ చేర్చారు.

**బెయిల్ ఆలస్యం కాదు**

కొత్త చట్టం వచ్చాక నేతల బెయిళ్లలో జాప్యం జరగదు. ప్రజాప్రతినిధిని పదవి నుంచి తొలగించే నిబంధన ఉన్నందున కోర్టులు వెంటనే జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. ఇదివరకే ఈ చట్టం అమల్లోకి వచ్చి ఉంటే అరవింద్ కేజ్రీవాల్ జైలుకు వెళ్లిన వెంటనే రాజీనామా చేయాల్సి వచ్చేది. బయటికొచ్చిన తర్వాత ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో చివరకు నైతికత ఆధారంగా రాజీనామాచేసి ఆతిశీని ముఖ్యమంత్రిని చేయాల్సి వచ్చింది. ఇప్పుడు మేం దానికి బదులుగా చట్టం తీసుకొస్తున్నాం. జైల్లో ఉండి ఎవ్వరూ ప్రభుత్వాన్ని నడపకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఆడ్వాణీ, యడ్యూరప్ప, జార్జి ఫెర్నాండెజ్‌లాంటివాళ్లు నైతికత ఆధారంగా రాజీనామాలు చేశారు. వీరెవ్వరూ జైలునుంచి పరిపాలించలేదు.

బెయిల్ పిటిషన్లు కోర్టుల్లో సుదీర్ఘకాలం సాగవు. నా కేసు (సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్) తప్పితే ఇతర ఏ బెయిల్ కేసూ సుప్రీంకోర్టులో అయిదు రోజులకు మించి సాగలేదు. బెయిల్ పొందిన వెంటనే నాయకులు తమ పదవులు స్వీకరించొచ్చు. జైల్లో ఉన్నప్పుడు మాత్రమే అక్కడినుంచి పాలన కొనసాగించడానికి వీల్లేదన్నదే బిల్లు ప్రధానోద్దేశం. 30 రోజులకు బదులు 40 రోజులకు బెయిల్ వస్తే 41వ రోజు మళ్లీ పదవి పొందొచ్చు. అభద్రతకు గురికావాల్సిన అవసరంలేదు. ప్రాథమిక విచారణ, ఎఫ్ఐఆర్ నమోదు, సమన్ల జారీ, విచారణలాంటి ఏ దశలోనైనా కోర్టుల నుంచి స్టే తెచ్చుకోవచ్చు. అరెస్టయిన వెంటనే బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**రెండేళ్లు గుజరాత్ బయటే ఉన్నాను**

న్యాయమూర్తి జస్టిస్ ఆఫ్తాబ్ ఆలం మా ఇంటికి ఎప్పుడూ రాలేదు. ఆ అవసరమూ రాలేదు. ఆదివారం కోర్టును ప్రత్యేకంగా సమావేశపరిచి నా బెయిల్ దరఖాస్తు విచారించారు. నాడు నేను గుజరాత్ హోంమంత్రిగా ఉన్నాను కాబట్టి సాక్షులను ప్రభావితం చేయొచ్చని దర్యాప్తుసంస్థ అనుమానం వ్యక్తంచేయడంతో బెయిల్‌పై కోర్టు నిర్ణయం తీసుకునేవరకూ నేను రెండేళ్లు గుజరాత్ బయటే ఉన్నాను. దేశచరిత్రలో ఎన్నడూ ఎవరి బెయిల్‌పైనా రెండేళ్లు విచారణ జరిగిన దాఖలా లేదు. జస్టిస్ ఆలం దయవల్ల నా బెయిల్ దరఖాస్తు రెండేళ్లు నడిచింది. తాజా బిల్లు ఆమోదం పొందుతుందని నమ్మకం ఉంది. జేపీసీ అధ్యక్షుడి ఎంపిక తర్వాత నివేదిక రావడానికి ఎంత సమయం పడుతుందన్నది తెలుస్తుంది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో దీన్ని తీసుకొస్తాం.

**నక్సలిజం మరో 20 ఏళ్లు సాగడానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పే కారణం**

దిల్లీ: అభివృద్ధికి, సంక్షేమానికి అడ్డంకిగా మారిన మావోయిస్టుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి గిరిజనులు ఏర్పాటు చేసుకున్న సల్వాజుడుంని రద్దుచేసి.. కొన ఊపిరితో ఉన్న నక్సలిజం మరో రెండు దశాబ్దాలు కొనసాగడానికి దోహదం చేసింది ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి ఆరోపించారు. సోమవారం ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్య చేశారు. "జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సల్ అనుకూలమని నేను ప్రత్యేకంగా చెప్పలేదు. ఆదివాసీల ఆత్మరక్షణకోసం ఉన్న వ్యవస్థను ఆయన సమాప్తం చేశారు. దానివల్లే నక్సలిజం మరో రెండు దశాబ్దాలకు పైగా సాగింది. అది ఆయన తీర్పేనని సుప్రీంకోర్టు రికార్డులే చెబుతున్నాయి. నక్సల్స్ కారణంగా దెబ్బతిన్న పాఠశాలల్లో సీఆర్‌పీఎఫ్, ఇతర భద్రతా బలగాలు ఉంటే రాత్రికి రాత్రి ఉత్తర్వులు జారీచేసి వారిని బయటికి పంపించేశారు. ఆ సమయంలో భద్రతా దళాలపై చాలాచోట్ల దాడులు జరిగాయి. కచ్చితంగా ఆ తీర్పుతో మావోయిస్టులకు రక్షణ లభించింది. దేశభద్రతపై ఎంపీలు ఆలోచించాల్సి ఉంది" అని చెప్పారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉండటం మైనస్ పాయింటేమీ కాదన్నారు. తమిళనాడు ఎన్నికల్లో ఖాతా తెరవడానికే ఆ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారనడంలో నిజంలేదన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామాకు అనారోగ్యమే ప్రధానకారణమని అమిత్ షా పేర్కొన్నారు.

# గగనసింహాలకు బై బై!

-మొదటిపేజీ తరువాయి

వాయుసేన సిద్ధమైంది. 23వ పాంథర్ స్క్వాడ్రన్ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విధుల నుంచి రిటైర్‌కానుంది. సెప్టెంబర్ 26న చండీగఢ్‌లో భావోద్వేగ వీడ్కోలు కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో మిగ్%–%21 యుద్ధవిమానాల ప్రస్థానంలోని కొన్ని ముఖ్య ఘట్టాలపై ఓసారి విహంగవీక్షణం చేద్దాం..

**1960 దశకంలో భారత్‌కు ఆగమనం..**

1963లో తొలిసారిగా రష్యా నుంచి భారత్ వీటిని కొనుగోలుచేసింది. తొలినాళ్లలో యుద్ధాల్లో విజయాలకు బాటలువేస్తూ మిగ్–21 విమానాలు తమకు ఏవీ సాటిలేవని నిరూపించుకున్నాయి. దాదాపు 870కిపైగా మిగ్ విమానాలు వాయుసేనలో వివిధ దశల్లో తమ అమూల్యమైన సేవలు అందించాయి. భారత వాయుసేనలో చేరిన తొలి సూపర్‌సోనిక్ ఫైటర్‌జెట్‌లుగా మిగ్–21ను చెప్పొచ్చు. గాల్లో చురుగ్గా కదలడం, అత్యధిక వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకత. మిగ్‌ల–21 యుద్ధ విమానాలు అనేక ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించాయి. 1965, 1971 యుద్ధాల్లో భారత చిరస్మరణీయ విజయాల వెనుక మిగ్ విమానాల కీలకపాత్ర ఉంది.

**అసమాన రికార్డ్**

మిగ్%–%21 రకం విమానాలు భారత్‌లోనేకాదు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో కీలక వైమానిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా అత్యధికంగా ఉత్పత్తయిన యుద్ధవిమానాల్లో ఒకటిగానూ ఇది రికార్డ్ సృష్టించింది. ఇప్పటిదాకా 60కిపైగా దేశాల్లో ఏకంగా 11,000 మిగ్‌లను తయారుచేశారు. ఇది సెకన్‌కు 250 మీటర్‌ల వేగంతో నిట్టనిలువుగా కూడా ప్రయాణించి శత్రు దేశాలను భయభ్రాంతులకు గురి చేయగలదు.

**గవర్నర్ భవనంపై భీకర దాడి**

1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో పాకిస్తాన్ సేనలపై భారత్ మిగ్%–%21 యుద్ధవిమానాలు విరుచుకుపడిన తీరు ఎవరూ మర్చిపోరు. ముఖ్యంగా ఆనాడు డిసెంబర్ 13వ తేదీన ఢాకాలోని గవర్నర్ అధికార భవనంపై మిగ్%–%21 బాంబులతో దాడిచేసింది. దెబ్బకు జడుసుకున్న గవర్నర్ మరుసటి రోజే పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత రోజే 93,000 మంది పాక్ సైనికులు భారత సైన్యం ఎదుట లొంగిపోయారు. 1999లోనూ కార్గిల్ యుద్ధంలో



మిగ్‌లు సత్తా చాటాయి. ఆపరేషన్ సఫేద్‌సాగర్‌లో భాగంగా ఆనాడు పాకిస్తానీ అట్లాంటిక్ విమానాన్ని మిగ్ ఒక్క దెబ్బతో నేలమట్టంచేసింది. అత్యంత శక్తివంతమైన ఎఫ్%–%16ను సైతం నేలకూల్చి 2019 ఏడాదిలో మిగ్ పత్రికల పతాక శీర్షికలకెక్కింది. మిగ్%–%21 పాతబడినాసరే అందులోని కొన్ని సాంకేతికతలు అత్యంత అధునాతనమైనవి. కంటికి కనిపించని సుదూర లక్ష్యాలపైనా దాడి చేసేలా రాడార్, తదితర సాంకేతికతలు దీని సొంతం.

**ఎగిరే శవపేటికలుగా అపకీర్తి**

తొలినాళ్లలో విజయ చిహ్నాలు గా చెలరేగి పోయిన ఈ విమానాలు కాలం గడిచేకొద్దీ పాతబడిపోయి ప్రాణాంతకంగా తయార య్యాయి. కాలం చెల్లిన మిగ్‌లను ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారనే విమర్శలూ ఎక్కువయ్యాయి. సుఖోయ్, రఫేల్, తేజస్ వంటి యుద్ధ విమానాల రాకతో వీటి అవసరం సైతం తగ్గిపోయిందని వైమానిక రంగ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. భారత వాయుసేన ఆధ్వర్యంలోని 872 మిగ్ విమానాల్లో 482 పలు ప్రమాదాల్లో నేలకూలాయని పుష్కరకాలం క్రితం నాటి రక్షణమంత్రి ఏకే ఆంటోని పార్లమెంట్‌లో చెప్పారు. భారత వాయుసే నలో అత్యధికంగా కూలిపో యిన యుద్ధవిమానాలుగా ఇవి అపకీర్తిని మూటగట్టుకున్నాయి. 1963లో తొలిసారిగా ఎక్కడైతే భారత వాయుసేనలోకి వీటిని తీసుకుని జాతికి అంకితం చేశారో అదే వైమానిక స్థావరంలో వీటికి తుది వీడ్కోలు పలకనున్నారు.

## ఒత్తిడి పెరిగినా భరిస్తాం..



అహ్మదాబాద్

'మనపై ఒత్తిడి పెరుగొచ్చు. కానీ, మనం దాన్ని భరిద్దాం' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి భారత్ వస్తువులపై అమెరికా 50% సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని మోదీ సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పలు పథకాలను ప్రారంభించి.. రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రైతులు, పశు పోషకులు, చిన్న పారిశ్రామికవేత్తల ప్రయోజనాల విషయమై రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించకుండానే ఆర్థిక ప్రయోజనాల చుట్టూ ప్రపంచ రాజకీయాలు తిరుగుతున్నాయన్నారు. రక్షణ, శక్తికి మారుపేరుగా నిలిచిన 'సుదర్శన చక్రధారి శ్రీకృష్ణుడు.. జాతీయోద్యమంలో రాట్నంపై నూలు వడికి స్వదేశీ దుస్తులు వాడాలన్న మహాత్మాగాంధీ బాటలో భారత్ సాధికారత సాధించిందని మోదీ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో సైనికుల ధైర్యం, గాంధీజీ మార్గం ప్రతిబింబించిందని ఆయన తెలిపారు. కానీ, 60–65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. దిగుమతి కుంభకోణాలకు పాల్పడేందుకు విదేశాలపై దేశం ఆధార పడేలా చేసిందన్నారు. గాంధీజీ బోధించిన ముఖ్య సూత్రాలను కాంగ్రెస్ పార్టీ గాలికొదిలేసిందని, ఆత్మను చిదిమేసి దశాబ్దాలుగా అధికారంలోకి రావడానికి ఆయన పేరును వాడుకుంటుందని మోదీ ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా, భారత్, పసిఫిక్ ద్వీప దేశం ఫిజీ మధ్య ఏడు అంశాలపై ఒప్పందాలు కుదిరాయి. మూడు రోజుల పర్యటనకుగాను ఫిజీ ప్రధాని సితివేని రబూకా ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్నారు.

## విధానపరమైన లోపాలుంటే... మరణ దండనను సవాల్ చేయవచ్చు



దిల్లీ

కేసు విచారణలో విధానపరమైన లోపాలుంటే తనకు విధించిన మరణ దండనను దోషి సవాల్ చేయవచ్చని, రాజ్యాంగ అధికరణం 32 అందుకు అనుమతిస్తుందని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. 2008లో నాగ్‌పుర్‌లో నాలుగేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన కేసులో మరణ దండనను ఎదుర్కొంటున్న దోషి వసంత్ సంపత్ అభ్యర్థనను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం సోమవారం అనుమతించింది. మరణ దండనను విధించడానికి ముందు నిందితుడి మానసికస్థితిపై నివేదికను తెప్పించుకుని ట్రయల్ కోర్టు పరిశీలించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు గతంలో ఓ తీర్పు సందర్భంగా స్పష్టం చేసింది. ఈ విషయంలో నిందితుల హక్కులకు భంగం కలిగితే మరణ దండన ఖరారైన కేసులనూ తిరిగి పరిశీలించడానికి అధికరణం 32 అవకాశం కల్పిస్తుందని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. దోషి పిటిషన్‌ను విచారణ జాబితాలో చేర్చడానికి సంబంధించి సీజేఐ అనుమతి కోసం పంపిస్తున్నట్లు తెలిపింది.

**సెఫాలజిస్ట్ సంజయ్‌ను అరెస్టు చేయవద్దు**

మహారాష్ట్ర ఓటర్ల జాబితాలపై దుష్ప్రచారం చేశారని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం (ఈసీ) పెట్టిన రెండు కేసుల్లో అరెస్టు నుంచి సెఫాలజిస్ట్ సంజయ్ కుమార్‌కు సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ఆయనను నిర్బంధించరాదంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది. ఓటర్ల జాబితాపై సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టులను సంజయ్ కుమార్ తొలగించడంతో పాటు బహిరంగ క్షమాపణ కూడా చెప్పారని ఆయన తరఫు న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు(2024), అసెంబ్లీ ఎన్నికలు (2025) మధ్య కాలంలో కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అసాధారణ స్థాయిలో హెచ్చు తగ్గులు ఉన్నాయంటూ ఈ నెల 17న తాను పెట్టిన రెండు పోస్టుల్లోని పొరపాటును వెంటనే గ్రహించి తొలగించానని సంజయ్ కుమార్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలపై దుష్ప్రచారం చేసే ఉద్దేశం తనకు లేదని సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్)కు చెందిన పరిశోధన విభాగం 'లోక్‌నీతి' కో–డైరెక్టర్ వివరించారు. తనపై నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని అభ్యర్థించారు.

**నిందితుడిని నిర్దోషిగా తేల్చినప్పటికీ నేర బాధితులు అప్పీల్‌కు వెళ్లవచ్చు**

విచారణలో నిందితుడిని కోర్టు నిర్దోషిగా తేల్చినప్పటికీ నేర బాధితులు, వారి వారసులు తమకు సరైన న్యాయం జరగలేదని అప్పీల్‌కు వెళ్లవచ్చని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఒకవేళ దోషిగా తేల్చి విధించిన శిక్ష తక్కువగా ఉందని, సరైన పరిహారం లభించలేదని నేర బాధితులు భావించినా కూడా అప్పీలు చేయవచ్చని తెలిపింది. తనకు అన్యాయంగా శిక్ష విధించారని నిందితుడు ఎలాగైతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి నిబంధనలు అవకాశం కల్పిస్తున్నాయో....నేర బాధితులు కూడా నేరశిక్షాస్మృతిలోని సెక్షన్ 372 ప్రకారం అప్పీలు చేయవచ్చని వివరించింది. కేసు విచారణ సమయంలో నేర బాధితులు మరణిస్తే వారి వారసులు దానిని కొనసాగించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది.

# .ఎలుకల మందు తీసుకున్న యువకుడికి అరుదైన చికిత్స

ప్రాణాలు కాబడిన యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ బృందం

**ఖమ్మం(సూర్య ప్రతినిధి)** ఎలుకల మందు తీసుకున్న యువకుడికి హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ రూరల్ వెంకటాయపాలెం చెందిన 16 ఏళ్ల బాలుడు యలబత్తిని శ్రీ లక్షిత్ ఎలుకల మందు ( పసుపు భాస్వరం) విషాన్ని తీసుకున్నాడు.మొదట స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందాడు .అయితే కడుపు నొప్పి వాంతులు బలహీనమైన కాలేయ పనితీరు కోగులోపతి సెరిబ్రల్ ఎడెమాతో అతని పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు హైటెక్ సిటీ లో ఉన్న యశోద హాస్పిటల్ ను ఆశ్రయించారు. అధునాతన చికిత్స అవసరం అని తెలుసుకొని యశోద హాస్పిటల్స్‌లో ఉన్న ఇంటర్నల్ మెడిసిన్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సైకియాట్రీ మరియు వాస్కులర్ సర్జరీలో నిపుణులతో సహా నిపుణుల బృందం పేషంట్ శ్రీ లక్షిత్ ను ఐసియులో చేర్చారు . అతనికి క్రిటికల్ సపోర్టివ్ థెరపీ యాంటీబయాటిక్స్ హెపాటోప్రొటెక్టర్లు మరియు ఇంటెన్సివ్ మానిటరింగ్‌తో పాటు మూడు సెషన్ల హై-వాల్యూమ్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లెక్సీ) చేశారని పేర్కొన్నారు . ముఖ్యంగా పసుపు భాస్వరంతో ఎలుకల మందు చాలా ప్రమాదకరమైనది మరియు వెంటనే చికిత్స అందించకపోతే శరీరంలో బహుళ అవయవ వైఫల్యానికి దారితీస్తుందని అన్నారు. ప్లాస్మా మార్పిడి మరియు బహుళ విభాగ విధానం వంటి అధునాతన చికిత్సలు వెంటనే అందించడం యువ రోగి ప్రాణాలను కాపాడడంలో కీలకమైనవి.అతను బాగా కోలుకోవడం చూసి మేము సంతోషిస్తున్నాము అని అన్నారు.పూర్తి చికిత్స తర్వాత అతని కాలేయ పనితీరు మరియు గడ్డకట్టే విధానం గణనీయంగా మెరుగుపడిందన్నారు. 2025 జూలై 29న అతను డిశ్చార్జ్ చేసామని అతనికి మానసిక చికిత్సతో పాటు కొన్ని కన్సల్టేషన్ తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. అటువంటి విషపూరిత పదార్థాలను ప్రమాదవశాత్తు లేదా




ఉద్దేశపూర్వకంగా తీసుకోవడంపై సరైన అవగాహన మరియు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ క్రిటికల్ కేర్ మరియు అత్యవసర వైద్యంలో ముందంజలో ఉందని అత్యాధునిక సౌకర్యాలు మరియు సంక్లిష్ట వైద్య అత్యవసర పరిస్థితులకు 24 గంటలూ సంరక్షణ అందించే అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులు ఉన్నారన్నారు.

## గణపతి ప్రతిమలను ఉచితంగా అందజేసిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి



**కూకట్ పల్లి, ఆగస్ట్ 25 (ప్రభాత సూర్య) :** శేర్లింగంపల్లి ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి కి మట్టి వినాయక విగ్రహాలు కాలనీలో ఉచితంగా అందజేయడానికి గణపతి ప్రతిమలను రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి కి సూచించారు. సోమవారం వెల్ఫేర్ కమిటీ సభ్యులు, అధ్యక్షులు, కార్యదర్శి, కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, కాలనీవాసులకు వినాయక విగ్రహాలు అందజేశారు. అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఏ కార్యక్రమానికైనా ముందుండి విజయవంతంగా కమిటీ సభ్యులు కాలనీవాసుల సహకారంతో నిర్వహిస్తున్నామని, కమిటీ సభ్యులు కాలనీవాసులు నాకు బలం వారే బలగం అని అన్నారు. మీ అందరి ఆశీస్సులతో ఏ కార్యక్రమమైనా విజయ వంతంగా ముందుకు తీసుకెళ్తున్నానని, చెట్ల కొమ్మలు, విద్యుత్తు వైర్లు, కేబుల్ వైర్ కాలనీలో గణపతి నిమర్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసివేసామని అన్నారు.ఇందుకు సహకరిస్తున్న వివిధ ప్రభుత్వ అధికారులకు, పత్రిక సోదరులకు, కాలనీవాసులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపార్ను. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాంచంద్రావు, కమిటీ సభ్యులు జి ప్రసాద్, ఎస్ శ్రీధర్ రావు, సూర్యనారాయణ, సుధాకర్, తాండవ కృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పందిరిని తొలగించే యత్నంలో విద్యుత్ షాక్.. ఒకరు మృతి

**సికింద్రాబాద్ :** శుభకార్యం కోసం వేసిన పందిరిని తొలగిస్తున్న క్రమంలో విద్యుతఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుమలగిరి పిఎస్ పరిధిలోని సరస్వతి నగర్ లో చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ తో ఒక వ్యక్తి మృతి చెందగా..మరో ముగ్గురికి గాయాలయ్యాయి. విద్యుతఘాదానికి గురైన వీడియోలు సీసీ కెమెరాలు నమోదయ్యాయి.రిసాలా బజారుకు చెందిన విజయ్ విష్ణు లక్కీ అనే ముగ్గురు వ్యక్తులు దీపక్ అనే వ్యక్తి వద్ద జీవనోపాధి కోసం టెంట్ హౌస్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. సరస్వతి నగర్ లో శుభకార్యం నిమిత్తం వేసిన టెంట్ తీస్తున్న క్రమంలో విద్యుతఘాతంతో విజయ్ అనే వ్యక్తి మృతి చెందగా..లక్కీ,విష్ణులకు గాయాలు అయ్యాయి. టెంట్ హౌస్ యజమాని దీపక్ ఆదేశాల మేరకు నిచ్చెన వేసుకుని టెంట్ తొలగిస్తున్న క్రమంలో టెంట్ హౌస్ ఇనుప రాడ్ కు విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా విద్యుతఘాతం జరిగింది. నిచ్చెన పైన ఉన్న విజయ్ కి తీవ్రగాయాలు కాగా నిచ్చెన పట్టుకొని ఉన్న విష్ణు,లక్కీలకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ సమాచారం అందించారు. హుటాహుటిన వారిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ విజయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న తిరుమలగిరి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శ

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ విమర్శించారు.


# డాక్టరేట్ సాధించిన పబ్బు దేవేందర్ గౌడ్ కు ఘన సన్మానం

**చౌటుప్పల్. ఆగస్టు 25. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండలం, లింగోజిగూడెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో "సెకండరీ గ్రేడ్ టీచర్" గా పనిచేస్తున్నటువంటి పబ్బు దేవేందర్ గౌడ్ ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ లో "వెనకబడిన తరగతులలో రాజకీయ అవగాహన, భాగస్వామ్యం, గౌడ సమాజంపై కేస్ స్టడీ" అనే అంశంపై పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించినారు.ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి డాక్టరేట్ సాధించిన పబ్బు దేవేందర్ గౌడ్ ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కూరెళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ... పాఠశాలలో పనిచేస్తున్న పబ్బు దేవేందర్ గౌడ్ పిహెచ్డి సంపాదించడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు దేవేందర్ ఉపాధ్యాయుడిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదవాలని తెలిపారు . అనంతరం డాక్టరేట్ విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తాను చలమల్ల వెంకటేశ్వర్లు గైడ్ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతులలో రాజకీయం లో అవగాహన భాగస్వామ్యం సమాచారం కొరకు ప్రముఖ రాజకీయ వేత్తలను కలిసి వారి అనుభవాలను



క్రోడీకరించి నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములుని, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ని, తెలంగాణ గీత కార్మిక ఫెడరేషన్ పల్లె రవికుమార్ ని, అమ్మల నారాయణ గౌడ్ మొదలగు వారందరినీ పీహెచ్డీ విద్యలో భాగంగా కలిసినట్టు తెలియజేశారు. చదవాలనే ఒక ఆలోచన, దృఢ సంకల్పంతో ఎంతోమంది విద్యావంతులను, మేధావులను స్ఫూర్తిగా తీసుకొని పీహెచ్డీ సాధించినందుకు ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి,అరుణ, పురుషోత్తమా చారి, విజయలక్ష్మి, రమేష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం టియుడబ్ల్యూజే (ఐ జె యు) తోనే సాధ్యం






వచ్చేనెల ఐదు వరకు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలను పరిష్కరించకపోవడం దారుణం

ఐక్యమత్యంగా ఉంటేనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయి

జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు

**కుత్బుల్లాపూర్, ఆగస్ట్ 25 (ప్రభాత సూర్య) :**జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ లిస్టు సంఘం (టి యు డబ్ల్యూ జె ) నిరంతరం పాటుపడుతుందని సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అన్నారు. సోమవారం సూరారంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పటిష్టత కోసం సభ్యులు పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 5వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ సభ్యులుగా నమోదు చేయాలని సూచించారు. సంఘంలో సభ్యులైన వారి వివరాలు కార్మిక శాఖలో నమోదు చేయించబడతాయని తెలిపారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఐక్యమత్యంతో ఉంటేనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై చొరవ చూపకపోవడం దారుణం అన్నారు. ఇకనైనా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, సాయిబాబాలు మాట్లాడుతూ జిల్లా కమిటీ పిలుపుమేరకు కార్యవర్గ సభ్యులంతా సభ్యత నమోదులను చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు బాధ్యులను వేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రా చారి, దయాకర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ కోశాధికారి శేషారెడ్డి, స్థానిక సభ్యులు గ్రంథాలు, రాజేందర్, కృష్ణ గౌడ్, శాంతన్, శ్రీనివాస్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## భర్త భార్యను చంపాడు .. కానీ అతి కిరాతకంగా చంపాడు

మల్కాజిగిరి డిసిపి పద్మజా రెడ్డి

**హైదరాబాద్ :** భార్యను హతమార్చి ముక్కలు ముక్కలు చేసి మూసి నదిలో పడేసిన కేసు వివరాలు మల్కాజిగిరి డీసీపీ పద్మజా రెడ్డి మీడియాకు వెల్లడించారు. స్వాతి, మహేంద్ రెడ్డి ఇద్దరు లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. పెళ్లి అయిన తర్వాత ఇద్దరు మధ్య నాలుగు సార్లు గొడవలు జరిగాయి. ఒక సంవత్సరం క్రితం అమ్మాయి కి అబార్షన్ చేయించాడు. స్వాతి మళ్ళీ గర్భవతి అయింది. మెడికల్ చెకప్ తర్వాత ఇంటకి వెళ్తా అనగానే గొడవ పడి ఆమెను కొట్టాడు. బయటకు వెళ్లి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత ఆమెను కొట్టగా కళ్ళు తిరిగి కోమాలో పోయింది. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు బాడీ పార్ట్స్ అన్ని కోసేసి మూసి నదిలో పడేశాడని అన్నారు. మూడు సార్లు మూసి వద్దకు వెళ్లి శరీర భాగాలు పడేసాడు. ఆ తర్వాత తన భార్య కనబడటం లేదని మహేందర్ తన చెల్లికి విషయాన్ని చెప్పాడు. మహేందర్ చెల్లి భర్త నరేందర్ రెడ్డి కి అనుమానం కలిగి మిస్సింగ్ కింద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మహేందర్ బంధువు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ తో మహేందర్ రెడ్డిని అరెస్ట్ చేశాం. ఘటన జరిగిన స్థలంలో పలు ఆధారాలు సేకరించడనీ జరిగింది. స్వాతి బాడినా లేదా ర మరో మహిళ అని నిర్ధారణకు డిఎన్ఎ టెస్ట్ నిర్వహిస్తాం. గతంలో గొడవలు విషయంలో వికారాబాద్ సొంత గ్రామంలో పోలీస్ కేసు నమోదు అయింది. పెద్దల సమక్షంలో గొడవ రాజీ కుదిరింది, ఆపై హైదరాబాద్ కు వచ్చారు. మహేందర్ రెడ్డి రాపిడో డ్రైవర్ గా పని చేస్తున్నాడు.

## నూతన అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్. కుశల్కర్

**సిద్దిపేట :** నూతన అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్. కుశల్కర్, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. కమిషనర్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ గా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందించారు.సిహెచ్. కుశల్కర్, 1995 ఎస్ఐగా పోలీస్ డిపార్ట్మెంట్లో అరంగేట్రం చేసినారు. ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలో పనిచేశారు,2008 సంవత్సరంలో సీఐగా ప్రమోషన్ పొంది ఉమ్మడి నిజాంబాద్, మరియు హైదరాబాద్ సిటీలో పనిచేశారు.

## 31లోపు పెండింగ్ కమిషన్ విడుదల చేయాలి

కలెక్టర్‌కి రేషన్ డీలర్లు వినతి



**నల్గొండ ఆగస్ట్ 25 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఐదు నెలలుగా రేషన్ కమిషన్ అందక ఇబ్బందులు పడుతున్న జిల్లాలోని పట్టణ, గ్రామీణ రేషన్ డీలర్లు సోమవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రేషన్ డీలర్ల సంఘం కోశాధికారి కోటగిరి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం, రూ.300 కమిషన్ ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు గౌరవ వేతనం అమలు కాలేదు. అలాగే ఐదు నెలలుగా కమిషన్ పెండింగ్‌లో ఉంది. ఈ నెల 31లోపు పెండింగ్ కమిషన్ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని ఈనెల 31లోపు కమిషన్ అందించకపోతే మళ్లీ ఆందోళన చేపడతాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జజిల్లా కోశాధికారి కోటగిరి సూర్యనారాయణ, నల్లగొండ డివిజన్ అధ్యక్షులు సత్తి రెడ్డి నకిరేకల్ ఐ ఎం జి పాయింట్ అధ్యక్షులు జాఫర్ నల్లగొండ పట్టణ మరియు గ్రామీణ రేషన్ డీలర్లు సముద్రాల యాదయ్య ఆఫీస్,జావేద్, కొడదల యాదయ్య, కొంగరి శీను, సత్యనారాయణ,అశోక్ రెడ్డి, దుర్గా, పద్మ,సంధ్య జిల్లా రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## బి ఎల్ ఆర్ హెూటల్ కేఫ్ ప్రారంభించిన ఖమ్మం మేయర్ నీరజ



**ఖమ్మం(సూర్య ప్రతినిధి)** ఖమ్మం నగరం చెరువు బజార్ బోనకల్ క్రాస్ రోడ్డు లో బిఎల్ఆర్ హెూటల్ కేఫ్ ని ఖమ్మం నగర మేయర్ పూనుకొల్లు నీరజ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెూటల్ యజమాని సయ్యద్ ఉద్దండు- సొందు బీ మేయర్ కు పూల మొక్క బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నాణ్యమైన ఆహార అబద్ధాలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖమ్మం నగర డిప్యూటీ మేయర్ పాతిమా జోహారా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడే సాహెబ్ ముస్లిం మైనార్టీ నాయకులు టెలికాం అడ్వైజింగ్ మెంబర్ ఇమామ్ బాయ్ స్థానిక కార్పొరేటర్ మాదూరి ప్రసాదు 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి డివిజన్ నాయకులు మాదూరి సైదారావు దూదేకుల సంఘం నాయకులు అబ్దుల్ కలాం మీరా షేక్ జానీ ఆరిఫ్ మిలిటరీ హెూటల్ ఎండి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.


## కరాటే పోటీలలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**చౌటుప్పల్. ఆగస్టు 25. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని హై స్కూల్ విద్యార్థులు హైదరాబాదులోని సూరారం విలేజ్ విఐపి ఫంక్షన్ హాల్ లో ఇంటర్నేషనల్ టైగర్స్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో జరిగిన 26వ జాతీయ స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గుత్తా కవిత గోపాల్ రెడ్డి తెలిపారు. అండర్ కటన్ 12వ విభాగంలో ఎల్ దాన్యశ్రీ, జి నవీన్ లు బంగారు పతకాలు, 15 మంది విద్యార్థులు సిల్వర్, బౌంజ్ పథకాలను సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలను నేర్చుకోవడం వల్ల తమను తాము కాపాడుకోవడమే కాక, శారీరక దృఢత్వం, ఆరోగ్యం, ఉత్సాహం, మేధస్సు పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి రమేష్ గౌడ్, కోచ్ వి అనిల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదవారికి కార్పోరేట్ స్థాయి వైద్యం-

మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**నల్గొండ ఆగస్టు 25 ప్రభాత సూర్య** నల్గొండ ధనవంతుల మాదిరిగానే పేదవారికి అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో నల్గొండ జిల్లాలో వైద్య రంగాన్ని పటిష్టం చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నల్గొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సుమారు కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపిక్ యూనిట్ ను పద్మ విభూషణ్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించగా, రాష్ట్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలలో మెడికల్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే గర్వించదగ్గ పద్మ విభూషణ్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అదనాతన వైద్య సదుపాయాలు కలిగిన లాప్రోస్కోపిక్ యూనిట్ ప్రారంభించడం సంతోషమని అన్నారు. నల్గొండ జిల్లాలో పేద ప్రజలకు మంచి వైద్యం అందించేందుకుగాను గతం నుండి తాను కృషి చేస్తున్నానని, సంవత్సరంలోపే ప్రభుత్వ వైద్య కళాశాలను ఆస్పత్రిని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డిఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృనాయక్, నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# చౌటుప్పల్ లో బీజేపీ నూతన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్,
రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి






**చౌటుప్పల్.ఆగస్టు 25.ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల మండలంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని చౌటుప్పల్ మండల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్ ఆధ్వర్యంలో సోమవారం నూతనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా నూతన కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన, నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు శాగ చంద్రశేఖర్ రెడ్డి, దూడల బిక్షపతి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉడుగు యాదయ్య గౌడ్, భత్తుల జంగయ్య గౌడ్, చినుకుని మల్లేశం యాదవ్, ములుగు వెంకటేశం గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, రమణ గోని శంకర్, పోలోజు శ్రీధర్ బాబు, ఆలే చిరంజీవి, కాయితి రమేష్ గౌడ్, దుర్గా కృష్ణ, యాస అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్ గౌడ్, పుట్టపర్తిని బాలరత్నం, నాటి మల్లేష్ గౌడ్, పర్నే శ్రీనివాస్ రెడ్డి, పి శ్రీనివాస్ చారి, బర్మ నాగరాణి, నూనె మాధవి, దిండు భాస్కర్ గౌడ్, కట్ట కృష్ణ, మునగాల తిరుపతిరెడ్డి, వనం సత్యనారాయణ, బద్దం రవీందర్ గౌడ్, కోయడ స్వామి గౌడ్, అల్మాస్పేట గౌతమ్, బోయ సంజీవ,తంగేళ్ల వెంకటేశం, తాటి శ్రీనివాస్, మునుకుంట్ల వెంకటేశం గౌడ్,నూనె సహదేవ్, రాధారం సత్తయ్య,లగ్గోని పాండు, వివిధ గ్రామాల బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి ఉత్సవాలు

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** బిందెశ్వర్ ప్రసాద్ మండల్ వారోత్సవాలు తేదీ 7 ఆగస్టు నుండి 25 ఆగస్టు వరకు జయంతి ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరుపుకొనడం విశేషమైన కార్యక్రమం. సోమవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 42 శాతం బీసీలకు రిజర్వేషన్ గురించి ధర్నా కార్యక్రమం ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో జరిగింది. ఆ కార్యక్రమంతో పాటు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి ఉత్సవాల సందర్భం పురస్కరించుకొని ఆర్ కృష్ణయ్య బీపీ మండల్ చిత్రపటానికి పూలదండలతో పూలతో సత్కరించి మండల్ ఆశయాలను సాధిద్దాం అని ప్రజానీకానికి పిలుపునివ్వడం జరిగింది. ముఖ్యంగా స్వాతంత్రం సిద్ధించిన తర్వాత గత 70 సంవత్సరాలలో బీసీలకు అన్ని విధాల అన్యాయం జరిగింది రాజకీయ సామాజిక ఆర్థిక విద్య వైద్యం మిగతా రంగాల్లో కూడా బీసీలకు రిజర్వేషన్ లేనందున అన్యాయానికి గురి అవుతూనే ఉన్నారు. బీపీ మండల్ గారి 40 సిఫార్సులను కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేయడం జరిగింది ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వం 42 బిసి లకు రిజర్వేషన్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొనడం జరిగింది అందుకుగాను తప్పకుండా ఈ స్థానిక ఎన్నికల్లో వార్డు మెంబర్ నుండి సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి రిజర్వేషన్లు డిక్లేర్ చేసి జీవోను జారీ చేయాలని కోరడం జరిగింది అదేవిధంగా రాష్ట్రపతి ఆమోదం తర్వాత ఎంపీ ఎమ్మెల్యేలకు కూడా 50% పైన ఉన్న బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాజకీయంగా ఆర్థికంగా న్యాయం చేయాలని పేర్కొనడం జరిగింది.భేరి రామచంద్ర యాదవ్ తెలంగాణ బిసి ఐక్యవేదిక అధ్యక్షులు తన సందేశంలో పోరాడితేనే తప్ప మనకు ఎట్టి పరిస్థితుల్లో న్యాయం జరగదని అడుక్కుంటే మనకు అధికారం రాదని అధికారమే అంతిమ లక్ష్యమని అధికారం కోసమే మనం బీసీలందరూ కులాలు , సంఘాలు మరియు చైతన్యవంతులైన ప్రజాప్రతినిధులు, పెద్దలు, అభిమానులు ఏకమై పోరాటం చేయాలని ఉద్యమ రూపంలో ఉధృతంగా తెలంగాణ రాష్ట్ర సాధించినట్లు మనం బీసీలకు రిజర్వేషన్ల తో పాటు ఆర్థిక సామాజిక రాజకీయ అన్ని రంగాల్లో న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఈ పోరాటంలో తెలంగాణ రాష్ట్ర బిసి , యస్ టీ మైనార్టీ ప్రజలందరూ మద్దతు పలకాలని ముఖ్యంగా బీసీల అందరూ ఏకం కావాలని ఐకమత్యంతో ఎస్సీ ఎస్టీ మైనారిటీస్ యొక్క ప్రజలను కలుపుకొని బహుజన రాజ్యం అధికారం సాధించాలని పేర్కొనడం జరిగింది ప్రజలారా పేద ప్రజలారా నిరుపేదలరా ముఖ్యంగా లక్షలు ఖర్చు అవుతున్న వైద్యం,విద్య మన పిల్లలకు అందుబాటులో



లేదు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వ అరకొర సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నందున నాణ్యమైన విద్య సాంకేతిక విద్య లాంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అందుబాటులో లేవు. పేదలందుకోలేకపోతున్నారు కేవలం ధనస్వామ్యం డబ్బులున్నవాళ్లే చదువులు చదువు కోవడం ఈ రోజుల్లో ప్రతి కార్పొరేట్, విద్య, ఆసుపత్రుల్లో వైద్యము ఖర్చులులక్షల్లో అయింది కాబట్టి తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీస్ ప్రజలారా తప్పకుండా మీరు ముందుకు వచ్చి అన్నిటికీ సమస్యల పరిష్కారమైన మాస్టర్ కి అధికారం సాధించుట. పోరాటం చేద్దామని మీరందరూ పాల్గొని సహకరించాలని ప్రజానీకానికి పిలుపునివ్వడం జరిగింది అగ్రవర్ణాల వారైనా మీరు న్యాయం చేయలేదు. న్యాయం జరిగే వరకు మండల్ మండల్ స్ఫూర్తితో పోరాడుదాం. బిందెశ్వర ప్రసాద్ మండల్ ఆశయాలను సాధిద్దాం బిందేశ్వర్ ప్రసాద్ అమర్ హెందేశ్వర్ ప్రసాద్ 40 సిఫార్సులను వెంటనే అమలు చేయాలి సామాజిక ఆర్థిక న్యాయం సాధించే వరకు పోరాటం ఆగదని స్లోగన్లు చేస్తూ జయంతి ఉత్సవాలలో భాగంగా ఈరోజు ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ కృష్ణ అన్న దేరి రామచంద్ర యాదవ్ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ కృష్ణమోహన్ బిసి ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం శేరిలింగంపల్లి ఉపాధ్యక్షులు అందెల సత్యనారాయణ యాదవ్, యువ నాయకుడు కార్యదర్శి చిన్న శ్రీశైలం యాదవ్ అభిమానులు బీసీ కార్యకర్తలు పెద్దలు ధర్నాలు కూర్చున్న పెద్దలు భారీ ఎత్తున బీసీలందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# రైతులకు ఎరువులను అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

### సిపిఎం ఆధ్వర్యంలో మంథని ప్యాక్స్ కార్యాలయం ముందు ధర్నా

**మంథని :** సకాలంలో రైతులకు ఎరువులను అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ విమర్శించారు. సోమవారం మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ రైతులకు ఎరువుల సరఫరా విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నాయని,కానీ క్షేత్రస్థాయిలో రైతాంగానికి ఎరువులు అందడం లేదని విమర్శించారు. రైతు సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉన్నదని యూరియా కొరత లేదని రాష్ట్రంలో మంత్రులు, అధికార పార్టీ నాయకులు, అధికారులు పత్రికలలో ప్రకటనలు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టులు



పెడుతున్నారని కానీ ఈరోజు మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఒక్క యూరియా బస్తా లేదని ఆరోపించారు.రైతులు వ్యవసాయ పనులు వదులుకొని ఉదయం నుండి సహకార సంఘాల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కోరమండల్ మరియు ఇతర ఫెర్టిలైజర్ షాపు యజమానులు ఇతర ఎరువుల బస్తాలు కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తామని షరతులు పెడుతున్నారని ఇతర పెస్టిసైడ్ మందులను అంటగడుతున్నారని ఆరోపించారు. అధికారులు ఫెర్టిలైజర్ షాప్ యజమానులు కుమ్మక్కై రైతుల నోట్ల మట్టి కొడుతున్నారని అన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి రైతాంగానికి యూరియా అందించాలని లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ల సందీప్, గొర్రెంకల సురేష్ రైతులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతి పత్రం.. క్యూఆర్ కోడ్ తప్పనిసరి

ఆన్లైన్లో దరఖాస్తు.. పరిశీలన తర్వాతే అనుమతి!! పోలీసు అనుమతులుంటేనే ఏర్పాటుకు అవకాశం




**గట్టుప్పల్ ప్రభాతసూర్య 25 , ప్రభాతవార్త :** వినాయక నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండటంతో జిల్లాలో మండపాల నిర్మాణాలు ఊపందు కున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్లు, వీధులు, బస్తీల్లో.. గణనాథులను ప్రతి ష్ఠించేందుకు వీలుగా మండపాల నిర్మాణాలు తుదిదశకు చేరాయి. నిర్వాహకులు భారీ వినాయక ప్రతిమలను తెచ్చి మండపాల్లో ప్రతిష్ఠి స్తున్నారు. వాటిని అందంగా తీర్చిదిద్దే పనులను కొనసాగిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో కొనసాగేలా.. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు మండపాల నిర్వా హకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వ హిస్తున్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. వినాయక మండపాలకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను జారీచేయనున్నారు. ఆన్లైన్ లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి, అన్నింటినీ నిర్ధారించు కొని పోలీసులు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. దీనికోసం మండవ నిర్వాహకులు విధిగా దరఖాస్తు చేయాలి. ప్రతిష్ఠించే విగ్రహం ఎత్తు, మండప ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జన ప్రదేశం తదితర వివరాలతో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అన్నీ సక్రమంగా ఉంటే అనుమతితో పాటు క్యూఆర్ కోడ్ ను జారీచేస్తారు. అంతా ఆన్లైన్ లోనే... మండప ఏర్పాటుకు పోలీసుశాఖ అనుమతి పొందడానికి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పనిలేదు. వెబ్సైట్ లో అనుమతి కోసం వివరాలను నమోదు చేసుకోవాలి. ఇది ఓ రకంగా దరఖాస్తు ప్రక్రియే. వీటి ఆధారంగా అనుమతులు జారీ అవుతాయి. అనంతరం ఆయా మండపాల్లో పోలీసుల అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీసు సూచనలను విధిగా ప్రదర్శించాలి. మండపాల వద్ద తప్పనిసరి నిబంధనలు.. జాగ్రత్తలివీ..!! జిల్లాలో వర్షాలు కురుస్తున్న తరుణంలో మండపాల నిర్మాణానికి నాణ్యమైన టార్పాలిన్లతో పాటు ఇతర భద్రత పరికరాలను వాడాలి.!! రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా రోడ్డుకు అడ్డుగా మండపాలు ఏర్పాటు చేయకూడదు.!! తప్పనిసరిగా విద్యుత్తు శాఖ అధికారుల అనుమతితో పాటు వారు సూచించిన విధంగానే కనెక్షన్ తీసుకోవాలి.!! నాణ్యతగల వైర్లు వినియోగించాలి. విద్యుదాఘాతానికి అవకాశం లేకుండా చూడాలి.!! అగ్నిప్రమాదాల నివారణకు నీటి బకెట్లు, ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలి.!! మండపం వద్ద ఏర్పాటుచేసే ప్లెక్సీల్లో కమిటీ సభ్యుల పేర్లు, బాధ్యత వహించే వ్యక్తుల ఫోన్ నంబర్లు ఉండాలి. 24 గంటల పాటు కనీసం ఒక వాలంటీర్ అయినా మండపంలో అందు బాటులో ఉండాలి.!! నిమజ్జన సమయం లో ప్రతి విగ్రహానికి ఐదుగురు బాధ్యులుగా ఉండాలి.!! రెండు స్పీకర్లు మాత్రమే వినియోగించాలి. మండపం వద్ద పోలీసు తనిఖీ కోసం పాయింట్ పుస్తకం ఉంచాలి.!! రాత్రి పది తర్వాత సౌండ్ బాక్సులను వాడొద్దు. సాంస్కృ తిక కార్యక్రమాలు చేపట్టొద్దు.!! మండపాల్లో మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, అసభ్య నృత్యాలు, ఇతరులను కించపరిచే పాటలు ప్రసంగాలు నిషేధం.!! అను మానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి గట్టుప్పల్ ఎస్ఐ ఎం సంజీవరెడ్డి వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతా వరణంలో అందరూ సంతోషంగా నిర్వ హించుకోవాలి. పోలీసుశాఖ తరపున అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. మండప నిర్వాహకులు' విధిగా అనుమతులు పొందాలి. నిబంధనలను పాటించాలి. పుకార్లను వ్యాప్తి చేయకుండా, మత సామరస్యానికి పాటు పడాలి. ఉత్సవ సమయంలో ప్రజలు, కమిటీ సభ్యులు, పోలీసు శాఖకు సహకరించాలి. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసుల సూచనలను పాటించాలి. అత్యవసర వేళల్లో పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

## సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తరలించొద్దు

ప్రజాపాలన కాదు ప్రజలను దూరం చేసే పాలనా
సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్




**ఇబ్రహీంపట్నం ప్రభాతసూర్య 25** సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఇబ్రహీంపట్నంలోనే నూతన భవనం నిర్మించాలని ఈరోజు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ర సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజలకు పరిపాలన దూరం చేస్తుందని అన్నారు ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని మంకాలకు తరలించే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలను పెంచే ఆలోచన మానుకొని ఆధునికీకరణ పేరుతో ఇతర ప్రాంతాలకు తరలించటం సరైనది కాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇబ్రహీంపట్నం, మంచాల యాచారం మండలాల ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను అందిస్తున్న కార్యాలయాన్ని వేరే ప్రాంతాలకు తరలించొద్దన్నారు. ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ లో అసంపూర్తిగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తక్షణమే పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ల ద్వారా వందల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం తీసుకుంటుందని కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. వృద్ధులు మహిళలు మారుమూల గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు.ఈ విషయంలో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి గారు స్పందించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలను తరలించకుండా యథావిధిగా కొనసాగించేటట్లు చూడాలన్నారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అన్ని పార్టీలను కలుపుకొని ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ బుగ్గరాములు, పంది.జగన్, మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష్, పార్టీ నాయకులు ఏర్పుల వీరేశం, పోచమని కృష్ణ, యెలామోని స్వప్న, ప్రభుదాసు, నరసింహ, విగ్నేష్ రాఘవేందర్,గణేశ, యాదగిరి, డాక్యుమెంటు రైటర్స్ అధిల్, అరవింద్ రెడ్డి, వెంకటేష్,నరహరి, ముకేశ్, సతీష్, మహేష్, రాజు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# యూరియా అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

బండ శ్రీశైలం

**గట్టుప్పల, ప్రభాతసూర్య ఆగస్టు 25 :** రైతాంగానికి అత్యవసరమైన యూరియాను సరిపడా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ శ్రీశైలం మండిపడ్డారు. సోమవారం గట్టుప్పల మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి రేవతికి సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి సరిపడా యూరియాను కేటాయించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. మిగతా కొరతతో రైతులు బారులు తీరుతున్నారు. అనేకమంది అస్వస్థతకు గురై గాయపడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల సమస్యపై పోరాడకుండా మూగబోయిందని విమర్శించారు. "ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. అధికారులు యూరియా కొరత లేదని చెప్పడం తప్పు. వెంటనే రాష్ట్రానికి సరిపడా యూరియాను అందించాలి" అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన




డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చాపల మారయ్య, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, అచ్చిని శ్రీనివాస్, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, సీనియర్ నాయకులు ఎం.డి. రబ్బాని, బుచ్చిరెడ్డి, శివన్నగూడెం సింగిల్ విండో చైర్మన్ బలం నరసింహ, రైతు నాయకులు పసుపుల చెన్నయ్య, కర్నాటి యాదయ్య, గిరి బిక్షం, బండారు కృష్ణయ్య, కట్ట పెద్ద యాదయ్య, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

**చౌటుప్పల్. ఆగస్టు 25. ప్రభాత సూర్య :** మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం... రంగురంగుల విగ్రహాలతో పర్యావరణానికి జరిగే నష్టాన్ని తగ్గిందామని చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. సోమవారం ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం భారత్ సేవా సహకారఫోరం చౌటుప్పల ఆధ్వర్యంలో బసవరాజ్ శ్రీనివాస్ సౌజన్యంతో బి.ఎస్.ఎస్. ఎఫ్ ట్రస్ట్ సభ్యులు బొబ్బిళ్ళ మురళి ఆధ్వర్యంలో ట్రినీటి హై స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వారి చేతుల మీదుగా మట్టి విగ్రహాలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత్ సేవ సహకార ఫోరం గత దశాబ్ద కాలం నుండి సమాజ సేవలు ముందుండి అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు.గత కొన్ని సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో మట్టి వినాయకుల పంపిణీని ఉచితంగా చేపడుతూ పర్యావరణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రజలంతా



కూడా మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. భారత్ సేవ సహకార ఫోరం సంస్థ చౌటుప్పల్ ప్రాంతంలో కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందని ఇలాంటి సంస్థలు ముందుకు వచ్చి ప్రజాసేవలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బి.ఎస్.ఎస్ ఎఫ్ సంస్థ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ను ఆయన అభినందించారు . ఈ కార్యక్రమంలో భారత్ సేవా సహకార పోరం ట్రస్ట్ సభ్యులు బొబ్బిళ్ల మురళి, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కెవిబి కృష్ణారావు, ప్రిన్సిపల్ డాక్టర్ మంజుల, దేవి కేబుల్ అధినేత పోలో శ్రీనివాస చారి, శ్రీలత దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లకు కమిషన్ విడుదల చేయాలనీ

రేషన్ డీలర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కి వినతి

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 25( ప్రభాత సూర్య)** రాష్ట్ర రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు ఐదు నెలల కమిషన్ రానందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సంస్థాన్ నారాయణ పూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన గౌరవ వేతనం 5000, ఇన్సూరెన్స్, హమాలీ దిగుమతి భరించాలని ఏనెల కమిషన్ ఆ నెలలో డీలర్ ఖాతాలో జమ చేయలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు ఇచ్చే కమిషన్ను నేరుగా పాత పద్ధతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు కమిషన్ ఒకేసారి విడుదల చేసి డీలర్ల ఖాతాలో జమ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు దూడల బుచ్చయ్య మండల గౌరవ అధ్యక్షుడు మహేశ్వర స్వామి జిల్లా ఉపాధ్యక్షుడు యాదయ్య



మండల ఉపాధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు శంకరయ్య డీలర్లు కొన్ రెడ్డి లక్ష్మయ్య, బి లింగయ్య, పి సత్తయ్య, ప్రతాప్ రెడ్డి జగదీశ్వరి, అనసూయ, వినోద, డి విజయలక్ష్మి, హేమలత, అరుణ్ కుమార్, నరసింహ, రాజు నాయక్ ఆంగోత్ పాండు నాయక్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకుల ను పూజిద్దాం పర్యావరణం ను పరిరక్షిద్దాం

పి ఏ సి చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**వినాయకచవితి పర్వదినం ను పురస్కరించుకుని మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ కార్యక్రమం ను వివేకానంద నగర్ లో పి ఏ సి చైర్మన్ అరికేపూడి గాంధీ కార్యలయంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తో కలిసి ప్రారంభించి, పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రజలకు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ అరికేపూడి గాంధీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాధ్యత తీసుకోవాలని , ఉచితంగా మట్టి వినాయకుల ప్రతిమలు పంపీణీ చేయడం చాలా సంతోషంగా ఉంది అని, మట్టి వినాయకుల పంపీణీ చేపడుతూ పర్యావారణ విషయంలో తమదైన పాత్ర పోషించడం పట్ల ప్రజలు అవగహన కలిగి ఉండలాని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, కాలనీ వాసులు ప్రతి ఒక్కరు సమాజ హితం మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణంను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉంది ప్రతిమలను చేసేది మట్టితో అలకరించేది ఆకులతో, పూజించేది పూలతో ,నిమజ్జనం చేసేది నీటితో గణపతి అంటే ఆకృతి కాదు, ప్రకృతి మన సనాతన సంస్కృతి అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.మట్టి వినాయకులను పూజించి మన యొక్క పర్యావరణాన్ని కాపాడుకుందాం మరియు చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరుకు మట్టి



వినాయకులను మన యొక్క స్వగృహం ప్రాంగణంలో నే నిమర్జనం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము అని , అదేవిధంగా పర్యావరణ హితం మట్టి గణపతులను పూజించాలని ఈ విషయంలో మహిళలు ముందుండాలని, ప్రతి ఒక్కరికి అవగహన కలిపించాలని, మట్టి వినాయకులను పూజించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా భవిష్యత్ తరాల ను దృష్టిలో పెట్టుకొని సమాజ హితం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ హితం ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన వినాయక విగ్రహాల ద్వారా చెరువులు కలుషితం అవుతాయి అని ,పర్యావరణ సమతుల్య త దెబ్బ తింటుంది అని కావున భావితరాలను దృష్టిలో పెట్టుకొని మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఒక్కరు తప్పకుండా పూజించి పర్యావరణంను పరిరక్షించాలని పి ఏ సి ఎమ్మెల్యే చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, మొక్కే శ్రీరామ రక్ష అని, మొక్కలు నాటడం మనందరి సామాజిక బాధ్యత అని, నాటిన మొక్కలను సంరక్షించడం మనందరి బాధ్యత అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, ఏం డి ఇబ్రహీం, పురెందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,జోగిపేట భాస్కర్, అష్రాఫ్, లక్ష్మణ్ రావు,ఆనంద్, సిపిఎం శోభన్, అశోక్ రెడ్డి , కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్స్ సంఘం సమ్మెకు సిద్ధం

మండల తాసిల్దార్ కు వినతి పత్రం



**గట్టుప్పల, ప్రభాతసూర్య ఆగస్టు 25 :** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతున్నట్లు మండల అధ్యక్షుడు గోలి యాదగిరి తెలిపారు. ఆయన వివరాల్లో పేర్కొన్నదాని ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 17,200 మంది రేషన్ డీలర్లు అనేక సమస్యలతో ఆందోళనలో ఉన్నారని, ఎన్నో సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఎటువంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. ముఖ్యంగా డీలర్లకు లభించాల్సిన కమిషన్లు పెంచాలని, 2025 జూలైలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రేషన్ డీలర్స్ సంఘం పిలుపు మేరకు సెప్టెంబర్ 5 నుండి ఐదు రోజులపాటు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 10 గంటల వరకు అన్ని దుకాణాలు మూసివేస్తామని గట్టుప్పల్ మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. డీలర్ల సమస్యలపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, సమ్మెకు దారితీసిన సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ నిర్ణయానికి సంఘం మండల కమిటీ నాయకులు బి.రాజు, ఎం.వెంకటేష్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.నాగేశ్వరరావు, జి.వెంకటమ్మ, వి.వెంకటేశ్, వి.శేఖర్, చి.జగదీశ్, ఎం.వెంకటేష్ తదితరులు సంతకాలు చేశారు.

## అక్రమ చర్చి నిర్మాణాన్ని కూల్చివేయాలి.

అన్యమాత ప్రచారం, ప్రార్థనలు చేసే వారి కుటుంబాలకు కుల, ఆదాయం పత్రలు ఇవ్వకూడదు

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కి వినతి



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 25(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో అక్రమంగా చర్చీ నిర్మించి అన్యమత ప్రచారం చేస్తున్నారు. గ్రామ కంఠానికి చెందిన భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వృద్ధులకు, వికలాంగులకు బిర్యానీ, వళ్ళు నొప్పులకు నూనెలు, మాత్రలు ఇచ్చి వారితో ప్రార్థనలు చేయిస్తున్నారు. సంస్థాన్ నారాయణపురం మండల ఎమ్మార్వో కి నిర్వాహకుల, అక్కడ ప్రార్థనలాల్లో పాల్గొనే వారికి కుల ఆదాయం ధ్రువపాత్రలు ఇవ్వకూడదు అని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అదేవిదంగా అక్రమంగా నిర్మించిన చర్చిని కూల్చివేయాలు అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో విశ్వహిందూ పరిషత్ సంస్థాన్ నారాయణపురం మండల ఉపాధ్యక్షులు రాసామళ్ళ ముత్యాలు, ప్రధాన కార్యదర్శి పట్నం బాలకృష్ణ,వి. హెచ్. పి కార్యకర్తలు నర్సింగ్ కిషోర్,నందగిరి జగత్, చెదురువెల్లి సాయి,ఏనుగు శివ,నూకం వంశీ, కొండా నవీన్,చెదురువెల్లి మహేష్,బోయిని కిరణ్, అజయ్,తదితరులు పాల్గొన్నారు

## చీమలకొండూరు నుండి మోటకొండూరు వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి

– సిపిఎం



**చీమలకొండూరు, ఆగష్టు 25(ప్రభాత సూర్య):** సిపిఎం పార్టీ చీమలకొండూరు శాఖ ఆధ్వర్యంలో పోరుబాటలో భాగంగా చీమలకొండూరు వయా ముస్తాలపల్లి మీదుగా మోటకొండూరు వరకు బీటి రోడ్డు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య డిమాండ్ చేశారు. భువనగిరి జిల్లా కేంద్రం నుండి చీమలకొండూరు మీదుగా ముస్తాలపల్లి నుండి మోటకొండూరు వెళ్లే రోడ్డు గుంతల మాయంగా మారి అనేక ప్రమాదాలకు కారణం అవుతున్నది రోజు అనేకమంది ప్రజలు విద్యార్థులు వ్యాపారస్తులు పరిశ్రమలో పనిచేసే కార్మికులు అనేకమంది రోడ్డుపై వెళ్తుంటారు గుంతల మయంగా మారిన రోడ్డు వల్ల ప్రమాదాలు జరిగి అంగవైకల్యంతో ఇబ్బందులు పడుతున్న వారు కొంతమంది ప్రాణాలు కోల్పోయిన వారు అనేకమంది ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిశీలన చేయడం జరిగింది. గ్రామంలో అండర్ డ్రైనేజీ సిసి రోడ్లు పెన్షన్లు ఇందిరమ్మ ఇల్లు గ్రామపంచాయతీ కార్యాలయం పూర్తి కానందున నిధులు మంజూరు చేసి పనులను వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజా పోరాటాలకు సిద్ధమవుతుందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడ ఆంజనేయులు రావుల పోశయ్య రావుల కిష్టయ్య మాదాను జోజీ జంగంపల్లి రాములు పల్లెర్ల యాదగిరి ఎలిమినేటి ఐలయ్య రావుల రాజు వడ్డేబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కంజర్ల కృష్ణమూర్తి...

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** బిసి ఉద్యమ నాయకుడు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా బీసీ సత్యాగ్రహ దీక్ష ఎంతో విజయవంతంగా జరిగింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు చట్టపరంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు..సత్యాగ్రహ దీక్షలో ఆర్ కృష్ణయ్య , జాతీయ ఉపాధ్యక్షులు సత్యం , తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ మధుసూదనాచారి , తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల నాయకులు,ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గం సీనియర్ బిజెపి నాయకులు కంజర్ల కృష్ణమూర్తి , మల్లేపల్లి గ్రామ వాస్తవ్యులైన సిరిగిరి కృష్ణమూర్తి, బీసీ సంఘాల కార్యకర్తలు, పెద్ద ఎత్తున బీసీలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ఈ సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేశారు.

ప్రభాత సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక



# కృష్ణసాయి ఎంక్లేవ్ కాలనీ సమస్యలను దశలవారి పరిస్కరిస్తాం..

కార్పొరేటర్ శ్రీకాంత్



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :మియాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ సాయి ఎనక్లేవ్ కాలనీ వాసులు కాలనీలో గల పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. సమస్య ల పై కార్పొరేటర్ శ్రీకాంత్ సానుకూలంగా స్పందించడం జరిగినది. ఈ సందర్భంగా మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మియాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ సాయి ఎనక్లేవ్ కాలనీవాసులు సభ్యులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సోమవారం రోజు తమను కలవడం జరిగినది అని, కృష్ణ సాయి ఎంక్లెవ్ కాలనీలో తలెత్తినటువంటి సమస్యలను స్వయంగా వెళ్లి పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పి ఎ సి ఛైర్మెన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో కృష్ణ సాయి ఎంక్లెవ్ కాలనీలో తలెత్తినటువంటి డ్రైనేజీ మంచినీటి కొరత, సమస్యలను విడతల వారిగా త్వరలోనే పరిష్కరిస్తామని, డ్రైనేజీ, మంజీర మంచినీటి వసతులను మెరుగుపరుస్తామని, మియాపూర్ డివిజన్లో ప్రతి కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని. శ్రీకాంత్ తెలిపారు, ముఖ్యంగా మియాపూర్ డివిజన్ ప్రజలకు అన్నివేళల్లో అందుబాటులో ఉండడం జరుగుతుందని, డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, మెరుగైన ప్రజా జీవనానికి అన్నిరకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషిచేస్తానని కార్పొరేటర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.దఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ కె కృష్ణ చారి, సాయి బాబు, వీరేందర్, బివిఎన్ ప్రసాద్ వెంకట్ రెడ్డి, శ్రీధర్, సురేందర్‌నాథ్, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి

**నల్గొండ ఆగస్టు 25 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్ర లోని సోమవారం ప్రజావాణిలో ఇంజం చంద్రకళ రమణారెడ్డి లు కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు పై విషయాన్ని తెలియజేయునది ఏమనగా నాకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలరు వారికి విద్యాబుద్ధులు పెళ్లిళ్లు చేసి జీవితంలో స్థిరపడడానికి ఎంతో తోడ్పాటు అందించడం జరిగింది నా యొక్క చిన్న కుమారుడైన ఇంజం దయాకర్ రెడ్డి, కోడలు స్వప్న కలిసి నా పేరు మీద గల మిర్యాలగూడలోని ఇంటి నెంబర్ 30 -128/1 లోని నూకల వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్ దగ్గర నల్గొండ జిల్లా నందు నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు నా పేరు మీద గల ఇంటిని వారు ఆక్రమించుకోవాలని చూసి నేను నా కోడలుకు ఇల్లు వికరించినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులో కేసులు వేయడం జరిగింది తద్వారా మొత్తం అన్ని వ్యవసాయ భూముల పైన మొత్తం 22 కేసులు వేసి మమ్మల్ని వేధింపులను గురి చేయడం జరుగుతుంది కావున తమరు దయ ఉంచి తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం అనుసరించి పోషణ అనగా తిండి బట్ట వసతి గూడు కలిసి ఉండడం జరుగుతుంది. మాకు గూడు నిరాశలమై మేము బయటకు బ్రతకడం మేము మా కష్టార్జితంతో కట్టుకున్న ఇంటిలో మా చిన్న కుమారుడు కోడలు మాత్రమే ఉండడం జరుగుతుంది దయచేసి సబ్ కలెక్టర్ మిర్యాలగూడ కోర్టు కేసులో ఉన్నదని ఉత్తర్వుల సంఖ్య /2576/2024. తేదీ22\7\202 ఇచ్చిన ఉత్తర్వులు పై అప్పిల్ చేయడం గురించి వారు ఇచ్చిన తీర్పు మాకు సంతృప్తికరంగా లేనందున తమరిని ఆశ్రయించడం జరిగింది కావున వయోవృద్ధులమైన మాకు ఇల్లును ఇప్పించి న్యాయం చేయగలరని కోరారు.



# రజక ఫెడరేషన్ చైర్మన్ను నియమించి 1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి

గోపి రజక

వికారాబాద్ జిల్లాలో కొత్తవారిక

డైరెక్టర్ లుగా అవకాశం ఇవ్వాలి యాదయ్య




**వికారాబాద్, ఆగష్టు 25( ప్రభాత సూర్య):** సాధించుకున్న బంగారు తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచి గత ప్రభుత్వాన్ని ఇప్పుడున్న ప్రభుత్వాన్ని అనేక సార్లు వినతుల ద్వారా ప్రెస్ మీట్ల ద్వారా రజక ఫెడరేషన్ చైర్మన్ ను నియమించి 1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాలను కోరడం జరిగింది కానీ ఇంతవరకు చైర్మన్ ను ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక వాపోయారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి పరిగి నియోజకవర్గ అధ్యక్షులు సిహెచ్ యాదయ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ మొగులయ్య,జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేష్, జిల్లా యూత్ అధ్యక్షులు అనిల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రజాసంక్షేమ ప్రభుత్వంలో రజక కులవృత్తిదారులకు న్యాయం జరగాలంటే ఫెడరేషన్ చైర్మన్ ను నియమించి 1000 కోట్లు నిధులు కేటాయించాలని గోపి రజక ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని కోరారు. వికారాబాద్ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి గారు 11 ఫెడరేషన్ లకు నోటిఫికేషన్ జారీ చేసి రజక డైరెక్టర్ లుగా గతంలో కేటాయించిన వారిని కాకుండా కొత్త వారికి అవకాశం కల్పించాలని పరిగి నియోజకవర్గ అధ్యక్షులు సి హెచ్ యాదయ్య సంబంధిత అధికారులను కోరారు. జిల్లా సమావేశానికి జిల్లా నాయకులు ప్రభాకర్,జిల్లా ఉపాధ్యక్షులు వెంకటయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్,జిల్లా కార్యదర్శి మల్లేష్, జగన్, లక్ష్మీ,అనీల్ మరియు నర్సాపురం చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# విపంచి ఫౌండేషన్ చే అమ్మ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

-అమ్మ పేరిట గ్రంథాలయ ఏర్పాటు అభినందనీయం...

-ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కావాలి

-విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్

-విపంచి ఫౌండేషన్ సలహాదారుడు ఆందోజు నాగభూషణం




**చౌటుప్పల్.ఆగస్టు 25. ప్రభాత సూర్య** వెల్లంకి గ్రామానికి చెందిన కవి, గాయకుడు, బండ్ల కృష్ణ స్వచ్ఛందంగా తన ఇంటిలో ఇటీవల ఏర్పాటుచేసిన అమ్మ గ్రంథాలయ ఏర్పాటు అభినందనీయమని విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ అన్నారు. సోమవారం విపంచి ఫౌండేషన్ ద్వారా సంస్థ గౌరవ సలహాదారులు విశ్రాంత ఉపాధ్యాయులు సాహిత్య సామాజికవేత్త అందోజు నాగభూషణము, ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ సంయుక్తముగా 200 గ్రంథాలను బండ్ల కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణము మాట్లాడుతూ... పుస్తక పఠనం పెంచడం కొరకు తన ఇంటిలోనే అమ్మ పేరిట గ్రంథాలయమును బండ్ల కృష్ణ ఏర్పాటు చేయడం ఎంతో గర్వంగా ఉందని, పుస్తక పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని నాగభూషణం అన్నారు. అనంతరం విపంచి ఫౌండేషన్ చైర్మన్ గ్రామీణ గ్రంథాల ఉద్యమకారులు అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు ఏర్పాటు చేసే వారికి విపంచి ఫౌండేషన్ ద్వారా పుస్తకాలు సమీకరణ చేయడం బాధ్యతగా తీసుకున్నామని, గ్రామాలలో గ్రంథాలయాలు అడుగడుగున ఏర్పాటై పుస్తక పఠనం పెరగాలనే సంకల్పంతో విపంచి ఫౌండేషన్ పని చేస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో జ్యోతిష్య పరిశోధకులు కూరెళ్ళ నరసింహాచారి, భక్తి పాటల గాయకుడు పోలోజు వెంకటాచారి, కట్ట లింగస్వామి పాల్గొన్నారు.

# ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న రాష్ట్ర బీసీ నాయకులు

**కూకట్ పల్లి, ఆగస్టు 25 (ప్రభాత సూర్య) :** స్థానిక సంస్థల ఎన్నికలలో 42 బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య హైదరాబాద్ ఇందిరా పార్క్ నందు నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొని సంఘీభావం మద్దతు తెలియజేసిన తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగా సంస్థ అధ్యక్షులు కొడపాక కుమారస్వామి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, కార్యనిర్వక అధ్యక్షులు జీ. బ్రహ్మేంద్ర రావు, తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, పృథ్వి గౌడ్, రామ్ మూర్తి గౌడ్, నంద గోపాల్, రాష్ట్ర నలుమూలల నుంచి బీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపినారు.



## జెల్లా వెంకటేశం మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

-చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి



**చౌటుప్పల్.ఆగస్టు 25. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండలం కోయలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సంత్ కబీర్ జాతి అవార్డు గ్రహీత, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు స్వర్గీయ జెల్లా వెంకటేశం మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సోమవారం కోయిలగూడెం గ్రామ పరిధిలోని రిక్కల సత్తిరెడ్డి గార్డెన్ జరిగిన స్వర్గీయ జెల్లా వెంకటేశం దశదిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్వర్గీయ జెల్లా వెంకటేశం చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.మృతుని కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ.. జెల్లా వెంకటేశం అకాల మరణం బాధాకరమని, వారు గ్రామ అభివృద్ధి కోసం, కాంగ్రెస్ పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లం బావి మాజీ సర్పంచ్ గుర్రం కొండల్,మాజీ ఎంపిటిసి కంది భూపాల్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల సంతోష్ కుమార్, నాయకులు గడ్డం జయశంకర్,గుర్రం రాఘవేందర్,తోర్పునూరి లింగ స్వామి,పొట్టబతిని పురుషోత్తం,గంజి కృష్ణ, ఎర్రగుంట నరసింహ,గుర్రం సత్తిరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశ జయప్రదం పట్ల హర్షం..



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ నరేన్ గార్డెన్ లో జరిగిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని ఇంత గొప్పగా విజయవంతం కావడం పట్ల గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా హర్షం వ్యక్తం చేశారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్క శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు ,ముఖ్య నాయకులకు ,బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ,ఉద్యమకారులకు, సోషల్ మీడియా సైనికులకు, మీడియా సోదరులకు ,పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీ బలాన్ని ,కార్యకర్తల ఐక్యతను నిరూపిస్తూ ఏకతాటి పై నడిచి సమావేశాన్ని ఇంత ఘనంగా జయప్రదం చేయడం కేవలం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే సొంతమని, రానున్న రోజుల్లో కూడా అందరూ ఇలాగె మన ఐక్యతను నిరూపిస్తూ పార్టీ తలపెట్టే ప్రతి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాట్లు ఆయన పేర్కొన్నారు.

## రేషన్ డీలర్లకు కమిషన్ విడుదల చేయాలని తాసిల్దార్ కి వినతి



**చిట్యాల, ఆగష్టు 25( ప్రభాత సూర్య):** :రాష్ట్ర రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు ఐదు నెలల కమిషన్ రానందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ నాయక్ కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన గౌరవ వేతనం , ఇన్సూరెన్స్, హమాలీ దిగుమతి భరించాలని ఏనెల కమిషన్ ఆ నెలలో డీలర్ ఖాతాలో జమ చేయలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు ఇచ్చే కమిషన్ను నేరుగా పాత పద్ధతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు కమిషన్ ఒకేసారి విడుదల చేసి డీలర్ల ఖాతాలో జమ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో మహిళలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట

ఫతేనగర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ క్రాంతి ముదిరాజ్



**కూకట్ పల్లి, ఆగస్ట్ 25 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో నిరుపేదలకు తెలంగాణ ముఖ్యమంత్రి నేతృత్వంలో కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుస్థిర పాలన అందిస్తోందని ఫతేనగర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ క్రాంతి ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరుపేద పేదింటి మహిళలకు ఉచిత కరెంటు 200 యూనిట్లు, 500 కే గ్యాస్, నిరుపేద మహిళలు నలుమూలలకు ఎక్కడికెళ్లినా ఉచిత బస్సు సౌకర్యం, తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పరిపాలించినప్పటికీ ఒక్క రేషన్ కార్డు కూడా అమలు చేయని సర్కారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే నిరుపేదల ప్రతి ఒక్కరికి కూడా రేషన్ కార్డు పంపిణీ కొనసాగుతుందని, పెళ్లి అయినా 10 నుంచి 12 సంవత్సరాలైనా వాళ్లందరికీ కూడా ఇంతవరకు ఒక రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వమే నిరుపేదల కుటుంబాలకు ఇచ్చే ఆస్కారం కొనసాగించామని, కూకట్ పల్లి నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలుగా చెరువులు కబ్జాలకు గురవ్వడంతో కేసీఆర్ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అనిశ్చిత ప్రజలు తిరస్కరించడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన మొట్టమొదటగా హైడ్రా తో కబ్జాలు తొలగించి చెరువుల శృంగీకరణ మొదలుపెట్టారని తెలిపారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో నల్ల చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసి ప్రజలందరికి ప్రజా ప్రయోజనాత్మకంగా జరిగిందని తెలిపారు. నేటి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండు నుంచి రెండున్నర సంవత్సరాలు గడుస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు. అదేవిధంగా ప్రతి వారికి కూడా సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రంలో నిరుద్యోగులకు 60 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, గత పాలకనేతలను సూటిగా ప్రశ్నిస్తున్నా ..రేవంత్ రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి కూకట్ పల్లి శాసనసభ్యుడి కళ్ళకు కనిపించడం లేదా? అవి అవాస్తవాలు కాదా అని ప్రజలు కూడా ఆలోచించాలని సూచించారు.

# ఈ వయస్సులోను నాగార్జున ఇంత బిజీనా.. ఒకవైపు షోస్, మరోవైపు సినిమాలు



కెరీర్‌ని ఎప్పుడు ఎలా మలచుకోవాలో నాగార్జునకి తెలిసినంతగా ఎవరికి తెలియకపోవచ్చు. ఆయన ఫ్లాపులు వచ్చిన అధైర్యపడరు. ఈ వయస్సులోను కూడా ఉత్సాహంగా సినిమాలు, టీవీ షోస్, యాడ్స్‌తో బిజీ బిజీగా గడిపేస్తున్నారు. ఈ ఏడాది మల్టీ-స్టారర్ ప్రాజెక్టులు, పవర్‌ఫుల్ పాత్రలతో తెరపై ఆకట్టుకుంటూ, వెర్సటైల్ యాక్టింగ్‌తో సత్తా చాటుతున్నారు నాగ్. హీరోగా కాకుండా సపోర్టింగ్ పాత్రలు చేసిన కూడా అవి ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది నాగార్జున కుబేర, కూలీ చిత్రాలతో ప్రేక్షకులని పలకరించగా, కుబేరలో పాజిటివ్ షేడ్స్ ఉన్న దీపక్ పాత్రలో నటించారు. కూలీ లో మాత్రం పవర్ ఫుల్ నెగటివ్ రోల్ సైమన్ గా కనిపించారు. స్టార్డమ్‌ను పక్కన పెట్టి, ఇతర హీరోల సినిమాల్లో ముఖ్యమైన పాత్రలు చేయడమంటే చిన్న విషయం కాదు. కానీ నాగార్జున ఆ ఛాలెంజ్ స్వీకరించి సత్తా చాటుతున్నారు. ఈ రెండు పాత్రల ద్వారా ఆయనకు టాలీవుడ్‌తో పాటు ఇతర ఇండస్ట్రీల్లోనూ మార్కెట్ పెరిగింది. ఇప్పుడు నాగార్జున తన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవబోయే 100వ సినిమా కోసం సిద్ధమవుతున్నారు. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఓ టాక్ షోలో మాట్లాడిన నాగార్జున, తన 100వ సినిమాకు తమిళ డైరెక్టర్ కార్తీక్ ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ సినిమా త్వరలోనే పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, ఇది యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కబోతోంది. “కింగ్ 100” అనే టైటిల్ పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. మరోవైపు నాగార్జున బిజీ షెడ్యూల్ ఇక్కడితోనే ఆగలేదు. బిగ్ బాస్ సీజన్ 9 కు కూడా హోస్ట్‌గా కూడా వ్యవహరించనున్నారు. సెప్టెంబర్‌లో ఇది మొదలు కానుంది. ఒకవైపు రియాలిటీ షో షెడ్యూల్, మరోవైపు సినిమా షూటింగ్.. రెండింటినీ సమాంతరంగా నిర్వహించేందుకు నాగార్జున ప్లాన్ చేసుకున్నట్టు తెలుస్తుంది. మొత్తానికి 2025లో నాగ్ బిజీయెస్ట్ స్టార్‌గా మారారు. నాగార్జున తన 100వ సినిమాలో చాలా డైనమిక్ పాత్రలో కనిపించనున్నారట. ఎమోషన్స్, యాక్షన్, ఫ్యామిలీ డ్రామా అన్నీ కలగలిసిన ఈ చిత్రం ఆయన కెరీర్‌కు మైల్ స్టోన్‌గా మారాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# బాలీవుడ్‌లో చాలా తక్కువ పారితోషికం.. పెద్ద సినిమాల్లో ఛాన్సుల్లేవ్!

హీరోయిన్ సిమ్రాన్ ఇండస్ట్రీకి వచ్చి నేటి(ఆగస్టు 25)కి 30 ఏళ్లు పూర్తవుతుంది. హర్‌జై అనే హిందీ చిత్రంతో 1995లో కెరీర్ ప్రారంభించింది సిమ్రాన్. బాలీవుడ్‌లో కన్నా సౌత్‌లోనే ఎక్కువ స్టార్‌డమ్ తెచ్చుకుంది. తెలుగు, తమిళ భాషల్లో అనేక సినిమాలు చేసింది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హిందీలో నేను గుల్మొహర్ అనే సినిమా చేశాను. ఆ మూవీ టీమ్ అంతా కూడా చాలామంచివారు. అదే సమయంలో మరో ప్రాజెక్ట్ కూడా చేశాను. కానీ, అక్కడ ఎవరితోనూ కనెక్ట్ కాలేకపోయాను. పైగా ఇక్కడ పాత్రకు నేను సూట్ అవుతానా? లేదా? అని లుక్ టెస్ట్ చేస్తుంటారు. అందుకు నేను అభ్యంతరమేమీ చెప్పను. ఓకే కానీ, కొందరు నాగురించి తెలియక.. పాత్రకు సరిపోతానో? లేదోనని వీడియో చేసి పంపించమంటారు. అంతేకాకుండా.. సౌత్ ఇండస్ట్రీలో ఇచ్చే రెమ్యునరేషన్‌లో పదో వంతు మాత్రమే చెల్లిస్తారు. అందుకే నా గురించి పూర్తిగా తెలుసుకున్నవారి దగ్గరే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాను. టూరిస్ట్ ఫ్యామిలీ తర్వాత చిన్న, మధ్య తరహా సినిమా అవకాశాలు చాలానే వచ్చాయి. అందులోనూ మహిళా ప్రాధాన్యత ఉన్న స్క్రిప్టులే ఎక్కువ! కానీ, పెద్ద ప్రొడక్షన్ హౌస్ నుంచి, బడా దర్శకనిర్మాతల నుంచి మాత్రం ఒక్క ఆఫర్ కూడా రాలేదు. నా కెరీర్‌లో చాలా హిట్లు ఉన్నాయి. ఎంతోమంది యంగ్ టాలెంట్ నన్ను ఆదర్శంగా తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది అని చెప్పుకొచ్చింది. ఈ ఏడాది సిమ్రాన్ ఫుల్ బిజీ. శబ్ధంతో అలరించిన ఆమె గుడ్ బ్యాడ్ అగ్లీలో అతిథి పాత్రలో మెరిసింది. టూరిస్ట్ ఫ్యామిలీతో సూపర్ హిట్టు అందుకుంది. ప్రస్తుతం ద లాస్ట్ వన్ అనే మూవీలో యాక్ట్ చేస్తోంది. విక్రమ్ సరసన నటించిన ధ్రువ నక్షత్రం ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు.





# పెద్ది సినిమాను తిరస్కరించిన నటి

ప్రస్తుతం ఇండియాలోనే టాప్ స్టార్లలో ఒకడు రామ్ చరణ్. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో అతను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించాడు. అలాంటి హీరో సినిమాలో కీలక పాత్ర చేయమంటే ఏ నటి అయినా సంతోషంగా ఒప్పుకుంటుంది. కానీ మలయాళ నటి స్వశిక మాత్రం చరణ్ కొత్త చిత్రం పెద్ది కోసం అడిగితే నో చెప్పేసిందట. ఆ చిత్ర బృందం నుంచి తనను మళ్లీ మళ్లీ అడిగినా ఆ సినిమా చేయను అనేసిందట. ఇంత క్రేజీ ప్రాజెక్టులో నటించడానికి ఆమెకు వచ్చిన అభ్యంతరం ఏంటి అనిపించడం సహజం. ఐతే ఇందులో ఆమెకు ఆఫర్ చేసింది చరణ్ తల్లి పాత్ర అట.స్వశిక వయసు ప్రస్తుతం 33 ఏళ్లే. రామ్ చరణ్‌కేమో 40 ఏళ్లు వచ్చేశాయి. స్వశిక తమిళ, మలయాళ భాషల్లో కొన్ని మిడిలేజ్డ్ పాత్రలు చేసిన మాట వాస్తవం. ఆమె ఎక్కువగా క్యారెక్టర్ రోల్సే చేస్తోంది. అంత మాత్రాన చరణ్ కంటే ఏడేళ్లు తక్కువ వయసున్న అమ్మాయిని తనకు తల్లిగా నటించమని అంటే ఫీలవ్వకుండా ఉంటుందా? తాను ఇప్పుడే ఆ తరహా పాత్రలు చేయాలనుకోవడం లేదని.. అందుకే ఆ సినిమాకు ఎన్నిసార్లు అడిగినా ఓకే చెప్పలేదని స్వశిక వెల్లడించింది. స్వశిక 2009 నుంచి సినిమాల్లో నటిస్తోంది. తమిళంలో వాగై అనే చిత్రంతో ఆమె కథానాయికగా పరిచయం అయింది. తర్వాత తమిళం, మలయాళంలో పలు చిత్రాల్లో నటించింది. తెలుగులోనూ ఎటు చూసినా నువ్వే అనే చిన్న సినిమాలో నటించింది స్వశిక. ఐతే ఈ మధ్య తమిళం, మలయాళంలో ఆమె చేసిన కొన్ని క్యారెక్టర్ రోల్స్ బాగా క్లిక్ అయ్యాయి. ముఖ్యంగా సూరి హీరోగా చేసిన మామన్ చిత్రంలో ఆమె చేసిన అక్క పాత్రకు చాలా పేరొచ్చింది. అదే సమయంలో ఆమె తెలుగులోకి తమ్ముడు చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో అడవిలో ట్రక్కు నడిపే వెరైటీ పాత్రలో నటించింది స్వశిక. కానీ ఆ చిత్రం డిజాస్టర్ కావడంతో ఆమెకు తెలుగులో బ్రేక్ రాలేదు. చరణ్ సినిమాలో తల్లి పాత్ర చేస్తే మంచి పేరే వచ్చేదేమో కానీ.. అది తన వయసుకు తగ్గ పాత్ర కాకపోవడంతో నో చెప్పింది. ప్రస్తుతం తమిళంలో ఆమె సూర్య హీరోగా నటిస్తున్న కరుప్పు చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. తమిళం, మలయాళంలో ఆమె చేతిలో చాలా సినిమాలే ఉన్నాయి.

# కూలీ, వార్ 2 చిత్రాలు ఆ చిన్న సినిమా ముందు తేలిపోయాయా.. ఇది కదా సక్సెస్ అంటే..




ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో ఒక కొత్త ట్రెండ్ నెలకొంది . పెద్ద హీరోలు, భారీ బడ్జెట్, గ్రాండియర్ సెట్‌లు, హైఎండ్ గ్రాఫిక్స్, పాన్ ఇండియా రిలీజ్‌లతో తెగ హంగామా చేస్తున్నారు. కానీ ఈ డిజైన్‌లో ఒక పెద్ద లోపం కనిపిస్తోంది, అదే “కథ”. సినిమాకు ప్రాణం కథే అయినా, ఈ మధ్యకాలంలో దాన్ని పక్కనబెట్టి మార్కెటింగ్ అండ్ మ్యాగ్నిట్యూడ్ మీదే ఫోకస్ పెరిగిపోతోంది. ఫలితంగా, వందల కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమాలు కథ లేకపోవడంతో డిజాస్టర్‌గా మిగులుతున్నాయి. అదే సమయంలో మంచి కథతో రూపొందిన చిన్న సినిమాలు మాత్రం ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆ కోవలోకే వస్తుంది సు ఫ్రమ్ సో. సు ఫ్రమ్ సో , ఓ కన్నడ హారర్ కామెడీ చిత్రం కాగా, ఆగస్టు 8న విడుదలైన ఈ సినిమా తెలుగులో మైత్రి మూవీ మేకర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చింది. పెద్ద హైప్ లేకుండా రిలీజైనప్పటికీ, సినిమా విడుదలైన మొదటి రోజు నుంచే బలమైన మౌత్ టాక్‌ను సంపాదించింది. కేవలం రూ.6 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు రూ.35 కోట్లు వసూలు చేయడం గమనార్హం. అది కూడా ఎక్కువగా కన్నడ వెర్షన్ నుంచే. తెలుగులోనూ ఈ సినిమాకు భారీ స్పందన లభిస్తోంది. మూడు వారాలు దాటినా ఇంకా థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. వార్ 2 (ఎన్టీఆర్ -హృతిక్ రోషన్ కాంబో) ,కూలీ (రజినీకాంత్ %-% నాగార్జున కాంబో) వంటి పాన్ ఇండియా బిగ్గీలను కూడా బాక్సాఫీస్ పరంగా పక్కకు నెట్టి సు ఫ్రమ్ సో చిత్రం బాక్సాఫీస్‌ని షేక్ చేస్తుంది. రెండు భారీ పాన్ ఇండియా చిత్రాల నడుమ విడుదలైన ఈ చిత్రం లాభాల బాట పట్టడం నిజంగా గొప్ప విషయం. సు ఫ్రమ్ సో సినిమా విషయానికి వస్తే.. జెపి తుమినాడ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో జెపి తుమినాడ్, షనీల్ గౌతమ్, రాజ్ బి శెట్టి, ప్రకాష్ తుమినాడ్, సంధ్య అరకెరె లు కీలక పాత్రలు పోషించారు.అలాగే ఈ సినిమాని కన్నడలో శశిధర్ శెట్టి బరోడా, రవి రాయ్ కైలాస, రాజ్.బి. శెట్టి లు నిర్మించగా తెలుగులో మైత్రి మూవీ మేకర్స్ విడుదల చేసారు.. చిన్న సినిమాగా వచ్చిన ఈ చిత్రం మంచి విజయం సాధించడంతో ఇది కదా అసలైన సక్సెస్ అంటే అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.